# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఫిబ్రవరి 2026

వెల : రూ. 10.00



## నవంబరు 19 నుండి డిసెంబరు 4 వరకు శ్రీ మాతాజీ వారిచే ఆస్ట్రేలియా మరియు న్యూజిలాండ్ దేశాల పర్యటన దృశ్యములు



శ్రీమతి సునీత మరియు అశోక్ - శ్రీ సద్గురు పాదపూజ





శ్రీ శివరామ్ - నీరజలతో శ్రీ మాతాజీ



# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ

సన్నిధానం కాళీమాత



సంపుటి 45 సంచిక 6

పేజీలు 44

ఫిబ్రవరి 2026

5సం॥ల చందా రూ. 500

2సం॥ల చందా రూ. 240

సంవత్సర చందా రూ. 120

విడిప్రతి వెల...... రూ. 10

**బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా**

**మేనేజరు**

**సమర్థ సద్గురు మాగజైన్**

**శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు**

**గుంటూరు జిల్లా**

Printed & Published by Paluri Siva Rama Kali Prasad on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, D.No.24-7-8, Sandeep Mansion Jonnavittula Vari St. Gandhi Nagar, Vijayawada N.T.R. Dist., Andhra Pradesh. Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


***ఈ సంచికలో*** ............................ ....... **పేజీ**


శ్రీ కాళీ ప్రసాద శతకము .................... ..........4

శ్రీబాబూజీ ఉవాచ......................................... 5

అమ్మమాట......................................... .................. 6

అనుభూతికి రాని సాన్నిధ్యం.........................................7

నాదోపాసన .......................................................10

త్వమేవ సర్వం మమ దేవ దేవ..............12

భగవద్గీత సాధన దీపిక ................................14

స్వామి దయానంద మహరాజ్... ...................16

శ్రీకృష్ణ కర్ణామృతం .............................................18

శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్‌వారి సహస్ర నామావళిః ....... 19

శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ! 21

నారద భక్తి సూత్రములు ................ ...............23

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు....25

నిజరూప దర్శనము ......................................26

శ్రీ బాబూజీతో నా ప్రయాణం ..................28

నిరీక్షణ ...........................................................................30

శ్రీ గురుగీత ........................................... .........33

గురుకృప ........................................... .............35

శ్రీబాబూజీతో అనుభవాలు .................. 37

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ....... ............................ ....................41

# శ్రీ కాళీ ప్రసాద శతకము - పాలూరి ప్రసాద్

9. *కానరాకున్న లేదు లేదంద్రు జనులు*
*మరి కరచరణాదులతో దిగివచ్చిన*
*మనవంటి మానవుడే యందురు*
*కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥*



తా: భగవంతునికి పెద్ద చిక్కు వచ్చి పడింది. ఆయన నిరాకారంగా ఉంటే 'ఆ! కనబడని దేవుడు ఉన్నాడని నమ్మకం ఏమిటి? లేనివాడి సంగతి వదిలేసి మన బ్రతుకులు మనం చూసుకుందాం' అనుకుంటారు జనులు. పోనీ ఆయన ఒక రూపాన్ని ధరించి మానవునిగా అవతరిస్తే 'ఈయనకూ మనలాగే రెండు చేతులు, రెండు కాళ్ళు వున్నాయి కదా! ఏమిటి ఈయన గొప్ప?' అంటారు. నిజంగా భగవానుని గుర్తించాలంటే అందుకు తగిన భక్తి, జ్ఞాన, వైరాగ్యములు కలిగి వుండాలి.

1) స్త్వైరిణి మనస్సుతో దేనిని పోల్చారు?
2) భగవంతుడి కంటే నాకు గురువే ఎక్కువ అన్నదెవరు?
3) కృష్ణుడు ఎప్పుడు కన్నీరు పెట్టుకున్నాడు?
4) కంటికి తగిలిన అక్షత ఏమి చేసింది?
5) పగటిపూట కృష్ణుడికి మాత్రమే రాత్రి ఎలా అయ్యింది?
6) శ్రీబాబు ఎవరి కంటినొప్పిని తాము తీసుకున్నారు?
7) జయవిజయులు ఏఏ గుణాలు పోగొట్టుకోవడానికి ఏఏ జన్మలెత్తారు?
8) సింహం, పులి, కుక్క రూపాలలో కనిపించిన పదార్థం ఏది?
9) ఎవరిని సేవించనిదే మోక్షం లభించదు?
10) మానవులలోని మూడు రకాలు ఏమిటి?

*సమాధానాలు లోపలి పేజీలలో ............................*

# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

26-10-1981

ఈరోజు రాత్రి 9గం॥లకు శ్రీ బాబూజీ దర్శనం యిచ్చారు. శ్రీ బాబు మాట్లాడుతూ మానవుడికి ఈర్ష్య, అసూయ, ఓర్వలేనితనము పుట్టుకతోనే వుంటుంది. మానవుడు దానినే జయించలేక పోతున్నాడు. ఎవరైనా తన కన్నా ఎక్కువ స్థితిలో ఉన్నా తనకన్నా ఎక్కువ సంపాదించినా ఈర్ష్య, అసూయత కలిగివుంటాడు. నేను చాలా భక్తుడిని అనే అహంకారం కూడా వుండకూడదు. అందరిలోనూ మంచినే చూడాలి. అప్పుడే సత్య వస్తువు గోచరిస్తుంది.



మానవులు మూడు రకాలుగా వుంటారు. వారు ఉత్తములు, మధ్యములు, అధములు. ఉత్తములు అసలు నీచభావాలనే రానివ్వరు. ఏ రకమైన అసూయ ద్వేషాలకి తావివ్వరు.

మధ్యములలో నీచభావాలు వచ్చినా వాటిని తొలగించు కుంటారు. ఎవరైనా మహాత్ముల బోధ విని తమలోని నీచభావాలను రహితం చేసుకుంటారు. ఈర్ష్య, అసూయత, అసహనము వచ్చినా తల దించుకుంటారు. దానిని నిలుపుకోనరు.

అధములలో ఈర్ష్య, ద్వేషాలు ప్రబలి ఉంటాయి. అధములు ఈర్ష్య ద్వేషాలతో కక్ష సాధిస్తారు. అనేక దుష్కర్మములు చేస్తారు. దాని ఫలితాన్ని అనేక వేల జన్మలవరకు అనుభవిస్తారు. ఇది మాత్రం సత్యం అన్నారు.

## అమ్మ మాట - జపమాలా ప్రసాద

# నిజమైన దసరా పండుగ

"ఆదిశక్తి స్వరూపిణియైన జగన్మాత 'దుర్గముడు' అనే రాక్షసుడుని చంపి, దుర్గగా ప్రకాశిస్తోంది. కేవలం రాక్షస సంహారమే కాక, మానవుల దుర్గతిని నాశనం చేస్తుందావిడ. '**దుర్గా, దుఃఖహంత్రీ, దుర్గతి నాశినీ, దుర్గమా**' – అని అమ్మ నామాలు. ఎవరైతే ఆ అమ్మని నమ్ముకుంటారో, వారి దుర్గతిని నాశనం చేసి, దుఃఖాలని హరించి దుర్గగా ప్రకాశిస్తుంది. నమ్మని వారికి ఆవిడ దుర్గమ (అందరానిది). నమ్మిన వారికి కోరికలన్నీ తీర్చే కల్పతరువే – జీవితాన్ని కనకమయం చేసే కనకదుర్గే.



వేదశాస్త్రాది విద్యలు నేర్చినా, పెద్ద పేరంది వేషము వేసినా అనేక లక్షలు గడించి, మెప్పు సంపాదించినా ఆ జగన్మాత దయ సంపాదించనినాడు అవన్నీ వ్యర్థమే. ఒంటి నిండా విభూతి పూసికొని, కళ్ళు మూసుకొని జపాలు చేసినా, అనేక గ్రంథాలు రచించినా, ఆ అమ్మను సేవించనిదే మోక్షం లభించదు. ఆ దుర్గాదేవియే 'సత్యవస్తువు'. ఆ సత్య వస్తువుని గురించి మనందరము కూడ ఈ దుర్గాష్టమి పుణ్యదినాన, మన తండ్రియైన సమర్థ సద్గురు దేవులయిన శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ మహారాజ్ వారి దివ్య సన్నిధిలో సమావేశమై, సరదాగా సంభాషించుకుంటున్నాము. ఆలోచిస్తున్నాము, ఆనందాన్ని అనుభవిస్తున్నాము. ఇలా గడిపిన ఈ కాలం మన 'నిత్యకాలంలో' జమవుతుంది. ఇదీ నిజంగా దసరా పండుగ జరుపుకోవడమంటే. అంతే గాని, క్రొత్తబట్టలు కట్టుకుని, పిండివంటలు చేసికొని తినడం మాత్రమే కాదు.

విభూతి పూసుకున్నంత మాత్రాన మనకి మోక్షం రాదు. విభూతి స్వరూపులం మనం అవ్వాలి. విభూతి అంటే విశేషమైన ఐశ్వర్యం – అంటే ఆత్మానుభూతి, అటువంటి ఆత్మానుభూతిని పొందడానికి మనకు అడ్డంగా వస్తున్న కామక్రోధాది రాక్షసులను, అహంకార, మమకారములనే అసురులని సంహరించి, దుర్గమమైన అవిద్యారణ్యము నుండి మనని దాటించి, సకల దుఃఖములను హరించి, అఖండైశ్వర్య భోగ భాగ్యములను, అఖండ భక్తి, జ్ఞాన వైరాగ్యములను ప్రసాదించి దుర్గామాత సర్వులని రక్షించుగాక!'

# అనుభూతికి రాని సాన్నిధ్యం

- పాలూరి కాళీప్రసాద్



కొంతమంది శిష్యులు తాము గురుదేవులకు ఎంతో సన్నిహితులమని, నిత్యం వారి దర్శన, స్పర్శన, సంభాషణాది భాగ్యాలు పొందుతూ ఉంటామని, గర్వంతో విర్రవీగుతూ ఉంటారు. అయితే శ్రీ గురుదేవులు చెప్పినట్లు ఒక గ్లాసులో నీరు, మరొక గ్లాసులో చక్కెర వేసి ఎన్నిరోజులు ప్రక్కప్రక్కన ఉంచినా ఆ చక్కెర మాధుర్యం ఈ నీటికి అబ్బదు కదా! అలాగే గురువుల బోధను ఆకళింపు చేసుకొని, వారు చూపిన మార్గంలో సాధన చేసి ఆధ్యాత్మిక అభివృద్ధిని సాధించకపోతే, ఎంతకాలం గురువుల అంతేవాసిగా గడిపినా మనలోని దుర్గుణాలు, బలహీనతలు పోవు కదా! పైగా గురువులంటే భవరోగ వైద్యులు. బాగా జబ్బు పడినవాడినే వైద్యుడు తన వైద్యశాలలో ఎక్కువకాలం ఉంచుకొని, అవసరమైతే ఐసీయూలో, నిరంతర పర్యవేక్షణలో జాగ్రత్తగా చూసుకొంటాడు. అదే ఏదో చిన్న రోగం వచ్చినవాడిని ఐదు నిమిషాలు మాట్లాడి, మందిచ్చి ఇంటికి పంపేస్తాడు. అలాగే బాగా మురికి పట్టిన బట్టే రజకుడి చేతిలో ఎక్కువసేపు ఉండవలసి వస్తుంది.

కేవలం భగవంతుడికి సన్నిహితంగా ఉండటమే కాక సాలోక్య, సామీప్య, సారూప్యాలు పొందిన వారు కూడా ఆత్మజ్ఞానం సాధించకపోతే తమ వెనుకటి గుణాలకు లోనై దూరమైపోయిన సంఘటన మనకు తెలుసు కదా. జయవిజయులు కేవలం వైకుంఠవాసులే కాక, స్వామి ఆంతరంగిక మందిరానికి ద్వారపాలకులుగా సామీప్యాన్ని, స్వామిలాగే నాలుగు చేతులు, వాటిలో శంఖ చక్ర గదాది ఆయుధములు కలిగి సారూప్యాన్ని పొందినా అహంకారం పోగొట్టుకోలేక శాపానికి గురి కావలసి వచ్చింది. ఆ శాపవశాత్తు వారెత్తిన మూడు జన్మలలో వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న దుష్ట గుణాలన్నీ బయటపడి, మురికి అంతా బయటకు వచ్చి, శుభ్రమైన వస్త్రంలాగా తయారైతే తప్ప తిరిగి స్వామి సన్నిధి లభించలేదు.

మొదటి జన్మలో హిరణ్యాక్షుణ్ణి తీసుకొంటే ఆయనకు వివాహం అయినట్లు గానీ, భార్యా పిల్లలు ఉన్నట్లు గానీ ఎక్కడా వినలేదు. అయినా ఈ భూమంతా నాకే కావాలని ఆత్రం! ఏం చేసుకుంటాడు? ఎవరికి పెడతాడు? నిష్కారణమైన లోభం తప్ప! అలాగే హిరణ్యకశిపుడు నాలుగు వరాలు పొంది నలుగురు దేవతలను జయించగానే ఇక నేనే భగవంతుడిని అనేంత మదం వచ్చింది. ఈ మదం ఎంత దూరం తీసుకు వెడుతుందంటే చివరికి తన అభిప్రాయానికి కట్టుబడని కన్న కొడుకుని కూడా

చంపేటంత వివేక హీనతను కలిగిస్తుంది. ఈ జన్మలో వరాహ, నారసింహ అవతారాలు ధరించి స్వామి వారిలోని ఈ లోభాన్ని, మదాన్ని క్షాళన చేయవలసి వచ్చింది.

అలాగే రెండవ జన్మలో రావణుడు. ఎంతమంది భార్యలు ఉన్నా తీరని కామం. ఇంకా కనబడిన స్త్రీమూర్తినల్లా అనుభవించాలనే కామం. ఎన్ని లక్షల సంవత్సరాలు జీవించినా, కుమారులు, మనుమలు పుట్టుకువచ్చినా తీరని కామం. అది చివరికి జగన్మాతను కూడా వదలలేనంత తీవ్ర స్థితికి తీసుకెళ్ళింది. అలాగే కుంభకర్ణుడికి ధర్మం తెలిసినా తన సోదరుని విడలేని మోహం. ఒక విషయం గమనిస్తే ఈ రాక్షసులందరూ ధర్మం చక్కగా తెలిసినవారే. ఏదో ఒక రూపంలో భగవంతుని ఆరాధించిన భక్తులే. కానీ వారిలో ఉన్న ఒక్కొక్క బలహీనతను అధిగమించే ఆధ్యాత్మిక శక్తి లేకపోవడంతో లోక వినాశనానికి కారణులై, చివరికి తాము కూడా అంతరించిపోయారు. వీరిద్దరిలో ఈ కామ మోహాలను క్షాళన చేసి తన వద్దకు చేర్చుకోవడానికి ఆ లక్ష్మీ నారాయణులిద్దరూ మానవ రూపాలను ధరించి ఎంత కష్టపడవలసి వచ్చింది!

ఇక మూడవ జన్మలో శిశుపాలుడికి అకారణ మాత్సర్యం. తనకు దక్కనిది ఇంకెవరికీ దక్కకూడదు. తనకంటే తాను శత్రువుగా భావించేవాడు ఎక్కువ గౌరవం పొందకూడదు. అలాగే దంతవక్త్రుడిది అకారణ క్రోధం. తన మిత్రులందరినీ శ్రీకృష్ణుడు సంహరించాడనే క్రోధంలో తన శక్తి సామర్థ్యాలు ఎంతో తెలుసుకోకుండానే యుద్ధానికి బయలుదేరాడు. మిగిలిన దుర్గుణాలతో పోలిస్తే ఈ రెండు గుణాలు క్షాళన చేయడం స్వామికి సులువుగానే సాధ్యమైంది.

ఇలా ఒక్కొక్క గుణాన్ని పోగొట్టుకోవడానికి వారికి ఒక్కొక్క జన్మ ఎత్తి వందలు, వేలు, లక్షల సంవత్సరాలు కూడా ఆ శాపగ్రస్త జీవితాలను గడపవలసి వచ్చింది. మరి అన్ని గుణాలను మనలో వుంచుకొని, ఏమాత్రం మారడానికి ప్రయత్నించకుండా కేవలం గురుదేవుల సాన్నిధ్యం లభించడమే మన గొప్పతనమన్నట్లుగా విర్రవీగితే ఎవరికి నష్టం? అయితే వీళ్ళవల్ల పాపం గురువులకు కూడా ప్రపంచంతో అనేక మాటలు పడవలసి వస్తుంది. సాధారణంగా ఒక వ్యక్తి వైద్యశాలలో ఎక్కువ కాలం గడిపినా, లేక ఐసీయూలో ఉన్నా మనం వారిని చూసి జాలి పడతామే కానీ, ఈర్ష్యపడము కదా! కానీ ఇటువంటి దుర్గుణాలతో బాధపడే రోగిని సంస్కరించే నిమిత్తం భవరోగ వైద్యులయిన గురుదేవులు తమ సన్నిధిలో ఎక్కువగా ఉంచుకుంటే లోకం ఈ గుణాలను గురువులకు కూడా అంటగట్టి వారిని నిందిస్తుంది. అంతెందుకు, ఆ గురువుల శిష్యులే “ఇదేమి అన్యాయం? సత్పురుషులు దూరమైపోతున్నా లెక్కపెట్టక గురువుగారు ఈ దుర్మార్గుడిని ఇంతగా చేరదీస్తున్నారే?” అనుకుంటారు.

అయితే దుష్ట శిక్షణకు, శిష్ట రక్షణకు ధరించే భగవంతుడి అవతారానికి, అందరినీ సమానంగా సంస్కరించడానికి గురురూపంలో వచ్చే అవతారానికి చాలా తేడా ఉంటుంది. గురురూపంలో కేవలం సంస్కరణే కానీ సంహారం ఉండదు. దానికి చాలా నేర్పు, సహనం, ఓపిక అవసరం. ఒక నేరస్తుడిని విచారించి కఠినమైన శిక్ష విధించేయడం చాలా తేలిక, కానీ వానిని నిరంతర పర్యవేక్షణలో వుంచి, పూర్తిగా సంస్కరించి, మంచివ్యక్తిగా తయారుచేసి పంపడం ఎంత కష్టం? తమ నిర్హేతుక జాయమాన కరుణా కటాక్షంతో గురుదేవులు సాధించే అతి కష్టమైన కార్యం ఇదే. "ఒక్క వ్యక్తి నేను చెప్పిన బోధను విని, సంస్కరింపబడి, నేను నిరంతరంగా పొందుతూ ఉండే బ్రహ్మానందాన్ని అందుకున్నా నా ఈ అవతారం సఫలమైనట్లే" అని శ్రీగురుదేవులు చెప్పేవారు.

అయితే వారు ఒక్కరితో ఈ అవతార ప్రయోజనాన్ని వదిలిపెట్టరు. "నేను కామరపుకోట జీడిని. ఒక్కసారి పట్టుకొంటే వదిలిపెట్టను" అనేవారు కదా! అలా వారి సంసర్గంలోకి వచ్చిన జీవులందరూ సంస్కరింపబడి, ఉద్ధరింపబడే వరకు వదిలిపెట్టలేరు. అయితే మనం మాత్రం ఈ సత్యాన్ని గ్రహించి, మనవంతుగా మనలోని దోషాలను, దుర్గుణాలను గ్రహించి, అధిగమించే ప్రయత్నం చేస్తే అదే మనం గురుదేవులకు చేసే అత్యుత్తమ సేవ. అంతే కానీ కేవలం గురుదేవులకు దగ్గరగా మసలి, వారి భౌతిక వ్యవహారాలను చక్కబెట్టడం అనేది నిజమైన సేవ అనిపించుకోదు. వారు నిరంతరం ఏ బ్రహ్మామృతాన్ని అనుభవిస్తున్నారో, దానిని మన అనుభూతికి తెచ్చుకోవడమే సాన్నిధ్యానికి పరమార్థం.

**గురువుని కేవలం మానవ మాత్రునిగా భావించరాదు. భగవానుని దివ్యజ్యోతిని సద్గురువులో దర్శించవచ్చు. సద్గురువే భగవంతునిగా దివ్య పరివర్తన చెందటం ఊహాతీతమైన ఒక అద్భుత లీల! లీలా మానుష రూపం దాల్చిన సద్గురువు తనపట్ల అచంచల విశ్వాసం నిలుపుకున్న వాళ్ళకి సకల శుభాలు అనుగ్రహిస్తాడు. మానవునికి భగవంతునికి మధ్యన అనుసంధాన కర్త సద్గురువే!**

\- శ్రీ కాళీబాబు

# నాదోపాసన

-భాగవతుల హనుమత్ జయప్రద

తెలుగుజాతికి వరంగా లభించిన మహానుభావులు ముగ్గురు కంచెర్ల గోపన్న (శ్రీభద్రాద్రి రామదాసు), బమ్మెర పోతన (శ్రీపోతనామాత్యులు), కాకర్ల త్యాగరాజు (శ్రీత్యాగరాజ స్వామి).

ఈ ముగ్గురిలో త్యాగరాజ స్వామి ఒక అపూర్వ సంగీత ముని. 'నాదోపాసన' అనే ఆధ్యాత్మిక మార్గాన్ని ప్రపంచానికి తెలియజేసి, భక్తి-సంగీతం-మోక్షసాధనకు ఒకే రూపముందని తన వ్యక్తిత్వంతో నిరూపించిన మహాత్ముడు. సంగీతం అనగానే త్యాగరాజస్వామివారు స్ఫురించడం సహజం.

వాగ్గేయకారునిగా ఈ మహాత్ముడందించిన కృతులు సంగీత జగతికీ, సాహిత్య లోకానికీ, ఆధ్యాత్మిక తత్త్వ ప్రపంచానికీ వెలుగునిచ్చే మణిదీపికలు. ఆయన జీవితం, కూర్చిన కృతులు, భక్తిని మాత్రమే కాదు, ధర్మాన్ని, విలువలను, జీవన విధానాన్ని తెలియబరిచి మనస్సుని శుద్ధిచేస్తాయి.

తెలుగునాట కర్నాటక సంగీతానికి ఆద్యుడిగా నిలిచిన ధన్యజీవి తాగయ్య. ఆయన పుట్టింది నిరుపేద కుటుంబం. సంపదలు ఆయన్ను వెతుక్కుంటూ వచ్చాయి, అయినా కూడా ఆయన మోహితుడు కాలేదు. లౌకిక కష్టాలను, సుఖాలను స్థితప్రజ్ఞతతో స్వీకరించారు. ప్రకాశం జిల్లా కంభం మండలంలోని కాకర్ల గ్రామంలో 1767, మే 4వ తేదీన జన్మించారు. ఆయన జన్మనామం కాకర్ల త్యాగబ్రహ్మం. రామబ్రహ్మం, సీతమ్మ దంపతులకు త్యాగయ్య మూడో సంతానం. వీరి కుటుంబం కొంతకాలం తరవాత తంజావూరు ప్రభువు శరభోజిని ఆశ్రయించింది. అక్కడికి దగ్గరలోని తిరువయ్యూరులో త్యాగయ్య తండ్రి రామబ్రహ్మం స్థిరపడ్డారు. త్యాగయ్య తొలి గురువు శొంఠి వేంకట రమణయ్య. త్యాగయ్య భార్య కమలాంబ. సీతామహాలక్ష్మి త్యాగయ్య కూతురు. త్యాగరాజు తండ్రి గారు రామబ్రహ్మం పండితులే కాకుండా రామభక్తులు కూడా. ఇంట్లో ప్రతి రోజూ భక్తితో రామపంచాయతన పూజ చేసేవారు. రామనవమి ఉత్సవాన్ని భవ్యంగా నిర్వహించేవారు. తంజావూరు రాజు తులజా మహారాజు వీరిని రాజభవనానికి పిలిపించుకుని రామాయణాన్ని చదివించేవారు.

త్యాగరాజు కూడా తన తండ్రిగారిలాగే రామభక్తుడిగా పెరిగారు. పెద్దలను చూస్తే మర్యాద, దేవునిపై భక్తి, పేదవారిపై దయకలిగి ఉండేవారు. ఊరివాళ్ళందరికీ త్యాగరాజంటే ముక్కువ. రామబ్రహ్మమే తన కుమారునికి రామనామాన్ని వుపదేశించారు. త్యాగయ్య చిన్నప్పుడు తిరువయ్యారుకు ఒక సన్యాసి వచ్చారు. ఆయన

పేరు రామకృష్ణానందస్వామి. వీరి ద్వారా కూడా త్యాగయ్యకు రామషడక్షరీ మంత్రోపదేశం జరిగింది. ఇది బాలుడిగా వున్న త్యాగయ్య మనస్సుపై గొప్ప ప్రభావం చూపింది. ఇంట్లో పూజ ముగిసిన తరువాత, త్యాగయ్య తల్లిగారు సీతమ్మ పురందరదాసుల కన్నడ కీర్తనలు, భద్రాచల రామదాసుల తెలుగు కీర్తనలు, తాళ్లపాక అన్నమాచార్యుల తెలుగు పద కవితలను దేవుని ముందు పాడేవారు. ఆ పాటలు పాడే సమయంలో త్యాగయ్య అక్కడే ఉండేవారు. అలా ఆ పాటలు వినీ వినీ ఆయన నోటికి వచ్చాయి. పాటంటే అభిరుచీ ఉత్సాహమూ పెరిగాయి. ఒక రోజు పూజ పూర్తి అయి, పాటలు పాడడం ముగిసిన తర్వాత త్యాగయ్య తనే ఒక దివ్యనామ కీర్తనను ఆ చిన్న వయసులోనే తయారు చేసి పాడేశారు. దేశీయ తోడి రాగంలో 'నమో నమో రాఘువాయ' అనే పాట ఇది. దీనిని విన్న తల్లిదండ్రులు ఇద్దరు ఆశ్చర్యపోయారు.

తంజావూరు రాజు ఆస్థానపు పండితులు శొంఠి వెంకటరమణయ్య సంగీత విద్వాంసులు. రాజు తన సింహాసనములోని అర్థభాగంలో వీరిని తనతోపాటు కూర్చోబెట్టి నిండుసభలో గౌరవించారు. వీరు వీణను అద్భుతంగా వాయించేవారు. రామబ్రహ్మం వీరిని కలిసి తన కుమారుడు త్యాగయ్యకు సంగీతం నేర్పించాలని కోరాడు. త్యాగయ్యను పరీక్షించిన వెంకటరమణయ్య ఆయనకు సంగీతం నేర్పారు. తనకు మంత్రం వుపదేశించిన రామకృష్ణానంద స్వామియే నారదుని అవతారమని త్యాగయ్య నమ్మారు.

"నిధి చాల సుఖమా? రాముడు సన్నిధి సేవ సుఖమా?"– మహాకవి పోతనవలే త్యాగరాజు కూడా తన కవిత్వాన్ని నరాంకితం చేయలేదు. ఒకసారి సుందరేశ మొదలియార్ అనే శ్రీమంతుడు తనపై కీర్తనలు చెప్పమనగా త్యాగరాజు నిరాకరించారు. శరబోజి మహారాజు తన ఆస్థానకవిగా ఉండమని కోరగా త్యాగరాజు అందుకు కూడా అంగీకరించలేదు. ఒక రోజు తంజావూరు రాజు, త్యాగరాజు ఖ్యాతి విని, 'ఈ సంగీత యోగిని రాజసభలో నియమించుకోవాలి' అని ఆశపడ్డాడు. అందుకోసం బంగారం, రత్నాలు, ఆభరణాలు నిండిన కావడి ఆయన ఇంటి ముందుకు పంపించాడు. ఇంటికి వచ్చిన ఈ బంగారం చూసి త్యాగరాజు ఆశ్చర్యపోయాడు. ఆయన మనసులో ఒక ప్రశ్న మొదలైంది: 'నిధి చాల సుఖమా? రాముడు సన్నిధి సేవ సుఖమా?' ధనం అంటే బంధనం, రామ సేవే నన్ను కాపాడుతుంది అని రాజు పంపిన సంపదను తిరస్కరించాడు. నిజమైన ఆనందం ధనంలో కాదు ధర్మంలో, భక్తిలో ఉందని నిరూపించాడు.

- సశేషం

# త్వమేవ సర్వం మమ దేవ దేవ

\- చిమటం గోపాల కృష్ణ

మా గ్రామం తణుకు తాలుకా వడ్డూరు. రజక కుటుంబం. నా చిన్ననాటనే తల్లి చనిపోయింది. సుమారు 10 సం॥ల వయస్సులో నా తండ్రి కూడా గతించారు. డా॥ రామచంద్రరాజుగారి భార్య ఛాయ అక్కగారి పుట్టినిల్లు కూడా వడ్డూరు. బట్టలకై వాళ్ళ ఇంటికి వెళ్ళినప్పుడు అక్కడ వారింట్లో శ్రీబాబుగారి ఫొటో చూస్తూ వుండేవాడిని. నేను మా చిన్నాన్న గారింట్లో వుండేవాడిని. ఒకసారి ఛాయక్కకు బాబుగారు కలలో కనబడి, 'నీ ఇంటికి ఒక కుర్రవాడు వస్తాడు వాడిని బాగా చూసుకో' అన్నారట. ఈ సంగతి తన స్నేహితులతో చెప్పగా 'నువ్వు అలాగే చెబుతావు' అన్నారుట. డాక్టరుగారు ఆశ్రమానికి వచ్చాక, ఇంట్లో పనికై నన్ను ఆశ్రమానికి రమ్మన్నారు. శ్రీ గాదె కోదండ రామయ్యగారు అప్పట్లో తణుకులో ఉద్యోగం చేసేవారు. మా చిన్నాన్న నన్ను వారికి అప్పజెప్పారు. వారు నన్ను 11-10-1978న (దసరా పూజలలో) ఆశ్రమానికి తీసుకు వచ్చారు. అప్పుడు నాకు సుమారు 12 సం॥లు.

'రామాలయంలో ఉపన్యాసాలు జరుగుతున్నాయి. వెళ్ళి బాబుకు నమస్కారం చేసుకో' అన్నారు ఛాయక్క. నేను నమస్కారం చేసుకున్నాను. బాబుగారిని చూడగానే నాకు నా ఇష్టదైవమైన రాముడే అనిపించారు. ఒకరోజు బాబు నడుస్తూ వస్తున్నారు. నన్ను చూసి, 'నువ్వెవరు?' అని పదే పదే అడిగారు. ఏం చెప్పాలో తెలియక సైగ చేసి డాక్టరుగారి ఇంటి వంక చూపించాను. ప్రక్కన వున్న వాళ్ళు చెప్పారు డాక్టరుగారింటికి వచ్చాడు అని. 'నువ్వు కొత్తగా వచ్చినా కూడా బాబుగారు నీతో చాలాసేపు మాట్లాడారు' అన్నారు చాలామంది. అమితమైన సంతోషం, ఒకింత గర్వం కూడా కలిగాయి నాకు.

డాక్టరుగారింటికి దగ్గరలో ఒక కొబ్బరి చెట్టు వుండేది. ఇంకా పూర్తిగా ఎదగలేదు. ఒక మట్ట ఎండిపోయి, పట్టు వదలకుండా వ్రేలాడుతూ వుండేది. ఎవరో నాకు చెప్పారు 'ఒరేయ్! దాని సంగతి చూడు' అని. నేను ఎగిరి దానిని పుచ్చుకుని గట్టిగా లాగసాగాను. ఊడి క్రిందపడింది. దాని చివర బాగా సన్నగా వున్న మోడు నా ఎడమ కన్ను గుడ్డుకు గుచ్చుకుంది. విపరీతమైన మంట పుట్టింది. చాలా బాధ పడ్డాను. డాక్టర్ అశోక్ గారు ఏదో మందు వేసి, కట్టు కట్టారు. అదే సమయంలో 'శ్రీబాబు ఎడమ కంటితో చాలా బాధ పడ్డారు. మట్ట గుచ్చుకున్న నువ్వు మాత్రం బాగానే వున్నావు' అని డాక్టర్ స్వర్ణ అన్నారు.

బాబు కన్ను పరీక్షించడానికై పాండుగారు గుంటూరు నుంచి కంటి డాక్టర్ దయాకర్‌గారిని తీసుకువచ్చారు. డాక్టర్‌గారు బాబు దగ్గరకు వెళ్ళగా 'నాకేమీ ఫరవాలేదు. ముందు ఆ కుర్రవాడి సంగతి చూడండి' అని నా దగ్గరకు పంపించారు. వారు నా కన్ను చూసి డ్రాప్స్ వేసి కట్టు కట్టారు. వారు రమ్మనమనగా గుంటూరు వెళ్ళాను. కొన్ని రోజులకు బాధ తగ్గిపోయింది.

ఒకసారి పొట్టలో ఇబ్బంది అనిపించి, భయం వేసి, బాబుతో చెప్పాను. శ్రీబాబు నా వీపు మీద గట్టిగా చరిచి, 'నువ్వు అప్పుడే చచ్చిపోవులేరా! నీకా భయం అక్కరలేదు. నువ్వు చెయ్యవలసింది ఇంకా చాలా వుంది. నేను ఉన్నాను కదా!' అని దీవించారు. అభయం ఇచ్చారు. ఒకరోజు 'నువ్వు భక్తులకు సేవ చేసుకుంటున్నావు కదా! నీకేదైనా పేరు పెట్టాలి' అని వెంటనే 'కృష్ణదాసు' అన్నారు.

నా కుడికాలు చీలమండ నుంచి మోకాలి వరకూ విపరీతంగా నొప్పి వుండేది. బాబుకు చెప్పాను. 'ఛీ వెధవా,పో. తగ్గుతుందిలే' అన్నారు. కలబంద కట్టమన్నారు. అయినా తగ్గలేదు. పందిపెంట కూడా కట్టమన్నారు. అయినా తగ్గలేదు. బాబు చాలాసార్లు నా కాలుకేసి చూసేవారు. నేను మనస్సులో అనుకునేవాడిని 'బాబు నా కాలికేసి రోజూ చూస్తున్నారు. కాని, ఇది తగ్గడం లేదు' అని. ఒక రోజు శ్రీబాబు హాలులో కూర్చున్నారు. నేను వెళ్ళి నమస్కారం చేసుకున్నాను. నన్ను కూర్చోమని, నా కుడి మోకాలు నుంచి క్రింది వరకు చేతితో గట్టిగా పట్టుకుని రాశారు. 'నువ్వు నన్ను రోజూ తిట్టుకుంటున్నావు కదా! నాలుగు రోజులలో తగ్గిపోతుందిలే' అన్నారు. అలాగే నాలుగురోజులకు పూర్తిగా తగ్గిపోయింది.

చిన్నప్పుడు పిల్లలతో ఆడుకునే సమయంలో తిట్టుకునే వాళ్ళం, కొట్టుకునే వాళ్ళం. అప్పుడు నాకు అమ్మ లేదనే సంగతితో చాలా బాధగా వుండేది. ఒకసారి శిష్యులతో కలసి శ్రీబాబు యాత్రకు వెడుతున్నారు. నాకు కూడా వెళ్ళాలనిపించి, బాబుతో చెప్పాను, 'నేనూ వస్తాను బాబూ! తీసుకెళ్ళండి' అని. 'మరి నువ్వు మీ అమ్మ నాన్నలకు చెప్పాలి, వాళ్ళు ఒప్పుకోవాలి కదా!' అన్నారు శ్రీబాబు. 'నాకు అమ్మ నాన్న లేరు బాబు' అన్నాను. 'అయ్యో! అలాగా! మరి ఇప్పడెలా?' అన్నారు. వారికి తెలియక అన్నారా! అది నాకు పరీక్షా! నేను ధైర్యంగా 'నాకు అమ్మ, నాన్న, గురువు, దైవం అన్నీ మీరే బాబూ!' అన్నాను. అంత ధైర్యంగా ఎలా అన్నానా అని తలచుకుంటే ఇప్పటికీ నాకు చాలా ఆశ్చర్యం అనిపిస్తుంది. 'సరే, అలాగే' అన్నారు బాబు. సుగుణక్కకు చెప్పి నా యాత్రకు అన్ని ఏర్పాట్లూ చేయించి నన్ను తీసుకుని వెళ్ళారు దయాహృదయులు బాబు! ఆ యాత్రలో బాబుగారి ఉతికిన బట్టలు ఆరవేయడం, నీళ్ళు మోయడం వంటి సేవలతో మనసు ఎంతో హాయిగా వుండేది.

ఒకసారి ఒక ఊళ్ళో నేను పనిచేసే చోట గొడవలు జరిగాయి. అవతల చాలా మంది వున్నారు. నేను ఒక్కడినే వున్నాను. నన్ను కొట్టడానికే సిద్ధపడి వచ్చారు. నాకు పారిపోయే అవకాశం లేదు. 'ఏదైతే అదే అవనీ, అన్నీ బాబే చూసుకుంటారులే' అనే మొండి ధైర్యంతో అలాగే నిలబడ్డాను. ఇంతలో సైరన్ మ్రోగించుకుంటూ పోలీసు జీపు, కారు అటుగా వచ్చాయి. జనం పలాయనం చిత్తగించారు. ఒక్కడు కూడా లేడు. ఇది బాబు చేసిన రక్షణ కాక మరేమిటి? ఏమీ తెలియని నన్ను ఆశ్రమానికి రప్పించి, రక్షణ కల్పించి, చేదోడు వాదోడుగా ఉండి, నా జీవితానికి ఒక అర్థం కలిపించారు శ్రీబాబు. 'నీవే నా తల్లివి, తండ్రివి, గురువు, దైవం. తోడు, నీడ నిజముగ బాబూ!'

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

12. న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః
న చైవ న భవిష్యామః సర్వే వయ మతః పరం ॥

శ్రీకృష్ణ భగవానుడు "అర్జునా! నేనుకాని, నీవు కాని, ఈ రాజలోకం కాని ఒకప్పుడు ఉండి ఒకప్పుడు లేకుండా పోలేదు. భూతకాలంలోనూ అందరం ఉన్నాము. ఇప్పుడు ఉన్న సంగతి నీవు చూస్తూనే వున్నావు. అలాగే భవిష్యత్తులో కూడా లేకుండా పోవటం అనేది జరగదు" అన్నాడు.



అంటే శ్రీకృష్ణ భగవానుడు దేహి కాలపరిచ్ఛిన్నం కాక, అనాది, అనంతము అయినది అని సూచిస్తున్నాడు. శ్రీకృష్ణ భగవానుడు "అర్జునా! వాళ్ళంతా స్వజనులు, నావారు అంటున్నావు కదా, ముందు నీవెవరివో, నీ వారెవరో తెలుసుకో. ఇప్పుడు నేను ఇక్కడ ఉన్నాను. నీవూ ఉన్నావు. నీవు ఏ స్వజనులను చంపటం పాపమని దుఃఖిస్తున్నావో, వారు కూడా ఉన్నారు. మనమందరం శూన్యంలో నుండి రాలేదు. అలాగే మరల శూన్యంలోకి తిరిగి పోవటం లేదు. సముద్రంలో తరంగాలు ఉద్భవించినప్పుడు సముద్రం శూన్యమై తరంగాలు రావటంలేదు. సముద్రమే తరంగాలుగా కనిపిస్తున్నది. అంతకు ముందు ప్రశాంతంగా ఉన్న నీరే ఇప్పుడు అలలుగా కనిపిస్తున్నది. నీవు ఇప్పుడు చూస్తున్న నేను ఒక అలను. నీవు ఒక అలవు. తక్కిన రాజలోకం కూడా అదేవిధంగా వేరువేరు అలలు. అలలుగా కనిపించే ముందు సముద్రం ఎలా ఉన్నదో అలాగే నీకన్నా, ఈ రాజలోకం కన్నా పూర్వము నుండి అందరికీ కారణమైనది, నిత్యమూ, సత్యమూ, జ్ఞానమూ, ఆనంద మయమూ అయిన సచ్చిదానందము అనేది ఒకటి ఉండనే ఉన్నది. ఆ సచ్చిదానందము సనాతనమైనది. అనాది. నేను, నీవు, వీరందరు కేవలం శూన్యం కాదు. మనమందరమూ, ఇంకా ఈ కనిపించేవన్నీ ఆ సనాతనము, ఆద్యంతరహితము అయిన సచ్చిదానందము యొక్క అభాస మాత్రమే. ఒకడు మట్టిని తీసుకొని ముందు ఒక కుక్కను చేసి,

దానిని చెరిపి వేసి, ఒక పులిని చేశాడనుకుందాము. మరల దానిని కూడా పాడుచేసి ఒక సింహాన్ని చేశాడనుకుందాము. సింహము చేయకముందు అక్కడ మట్టి ఉన్నది. శూన్యం కాదు. నిజానికి అక్కడ ఉన్నది మట్టి మాత్రమే. సింహము, పులి, కుక్క అనేవి అన్నీ ఆ మట్టి దాల్చిన ఆకారాల పేర్లు మాత్రమే. ఆ మట్టియే కుక్క, పులి, సింహము అని వేరువేరు ఆకారాలలో ఉన్నప్పుడు వేరువేరు పేర్లతో పిలువ బడుతున్నది. అదే విధంగా నీవూ, ఇక్కడ చేరిన రాజన్యులందరూ కూడా, ఆ సచ్చిదానంద పరబ్రహ్మము యొక్క వేరువేరు రూపములే. వేరు వేరు ఆకారములతో, వేరు వేరు గుణములతో, స్వభావములతో, వీరందరిలా కనిపిస్తూ వేరు వేరు పేర్లతో పిలువబడుతూ నిజమైన ఉనికిని కలిగి ఉన్నది ఆ సచ్చిదానందమే సుమా. నీవు ఈ దృష్టితో చూచినట్లైతే ఇందులోని సత్యాన్ని గ్రహించినట్లైతే, నీ స్వధర్మాన్ని ఆచరించటానికి సందేహించవలసిన అవసరం కాని, భయపడవలసిన అవసరంగాని లేదు" అని వివరించాడు.

ఆ విధంగా కనులకు కనిపిస్తున్న జగత్తునే సత్యమని నమ్మి సమ్మోహితుడైన అర్జునుడికి ఆధ్యాత్మిక దృష్టిలోపం వల్ల స్వజనాన్ని గురించి, వారిని వధించటాన్ని గురించి, సంప్రాప్తమైన సందేహాలను శ్రీకృష్ణ భగవానుడు నిర్మూలించటం మొదలు పెట్టాడు.

- సశేషం

**స్వార్థం, అవినీతి, నేరప్రవృత్తి వెర్రితలలు వేస్తున్న ఈ అస్తవ్యస్థ పరిస్థితులలో ప్రజలలో నైతిక విలువలను పెంపొందింప జేయడానికి, దైవంపట్ల భక్తి విశ్వాసాలను పాదుకొల్పడానికి, సామాజిక వ్యవస్థ రూపురేఖలను తీర్చిదిద్దడానికి అవతరించిన అవతార పురుషుడే గురువు.**

- శ్రీ బాబు

# స్వామి దయానంద మహరాజ్

సేకరణ - మురళి

(గత సంచిక తరువాయి)

స్వామీజీ ఆలోచనాత్మక సమాధానానికి మెచ్చిన ఆ సాధువు, ఆయనకు ఆధ్యాత్మిక మార్గంలో దారి చూపడానికి అంగీకరించి, స్వామీజీని తనతో ఉండేందుకు అనుమతించారు. నాగ సాధు మహాత్ముడు స్వామీజీని ఆశీర్వదించి తన శిష్యునిగా స్వీకరించి, ఆయనకు 'దయానంద్' అనే పేరు పెట్టారు. స్వామీజీ ఆ నాగ సాధువు వద్ద 7, 8 నెలలు గడిపి, అంకితభావంతో ఆయనకు సేవ చేశారు. నాగసాధువు స్వామీజీని తపస్సు మార్గంలోకి ప్రవేశించమని, ఒక సన్యాసిగా మారమని సూచించారు. స్వామీజీ వెంటనే ఆయన సూచనను అనుసరించి సన్యాసి దుస్తులు ధరించారు. నాగసాధువు సన్నిధి మరియు బోధనలు స్వామీజీని సాత్విక జ్ఞానం మరియు ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని పొందాలన్న తాపత్రయంతో నిండి పోయేలా చేశాయి. నాగసాధువు దగ్గర నుండి తాను పొందాల్సినంత సాధించాను, ఇక మరింత జ్ఞానం కోసం ఎక్కడికైనా వెళ్ళాలని, ఆయన నాగసాధువుకు కృతజ్ఞతలు తెలిపి, వెళ్ళేందుకు అనుమతి కోరారు. నాగసాధువు స్వామీజీని ఆశీర్వదించి, సరైన జ్ఞానం మరియు ఆధ్యాత్మిక విజ్ఞానం పొందిన తర్వాత పరమానందాన్ని పొందుతావు అని ఆశీర్వదించారు. ఆ తరువాత స్వామీజీ హరిద్వార్ (రిషికేశ్) వైపు పయనమయ్యారు, ఇది ఆయన ఆధ్యాత్మిక ప్రయాణంలో ఒక కీలక దశగా మారింది.

స్వామీజీ హరిద్వార్‌కు చేరుకుని అక్కడ ఆయన అనేకమంది సన్యాసులు, సాధువులు, నాగసాధువులను కలిసి చర్చించిన తరువాత కొంతమంది మహాత్ములు "ధర్మగ్రంథాల అధ్యయనంతో పాటు యోగాభ్యాసం కూడా ఆధ్యాత్మిక సిద్ధి కోసం అవసరం" అని చెప్పారు. హరిద్వార్‌లో మరొక స్వామీజీ చేసిన సూచనతో రిషికేశ్ సమీపం లోని "శేషం ఝూరి" అనే ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ ఒక విరక్త (వైరాగ్యవంతుడు) "స్వయంభూ స్వరూప్" అనే బ్రహ్మచారి సంత్ ఉన్నారు, ఆయన అధ్భుతమైన ఆధ్యాత్మిక విజ్ఞానం కలిగి ఉండి, పవిత్ర వర్గాలలో ఎంతో గౌరవాన్ని పొందుతున్నారు. వారిద్దరూ పరస్పర ఆధ్యాత్మిక, పవిత్ర విషయాల్లో చర్చలు జరిపారు. ఆ తర్వాత వారు స్నేహితులుగా, ఒకరినొకరు మార్గనిర్దేశనం చేసుకునే భాగస్వాములుగా మారారు.

స్వయంభూ స్వామితో జరిగిన ఈ కలయిక, స్వామీజీ జీవితంలో ఒక గొప్ప మలుపుగా మారింది. స్వయంభూ స్వామి, స్వామీజీ యొక్క ఆధ్యాత్మిక తపనను గుర్తించి, రిషికేశ్‌లో ఉన్న "కైలాశ్ ఆశ్రమ్" అనే ప్రఖ్యాత ఆశ్రమాన్ని సూచించారు. అక్కడ యోగం

మరియు ధర్మగ్రంథాల లోతైన జ్ఞానం రెండూ నేర్చుకునే అవకాశముంటుందని చెప్పారు. అయితే అక్కడకు చేరాలంటే మహామండలేశ్వర్ స్వామి విష్ణుదేవానంద్ గిరిజీ మహారాజ్ అనుమతిని పొందాలి. స్వామీజీ, స్వయంభూ తీర్థ్‌తో కలిసి కైలాశ్ ఆశ్రమానికి వెళ్ళారు. స్వయంభూ స్వామి యొక్క సూచన, మరియు స్వామీజీ యొక్క ఆధ్యాత్మికత పట్ల ఉన్న నిజమైన తపన చూసి మహామండలేశ్వర్ ఆయనకు ఆశ్రమంలో చేరేందుకు అనుమతి ఇచ్చారు.

ఆ కాలంలో కైలాశ్ ఆశ్రమం అనేది ఒక ప్రసిద్ధ విద్యా కేంద్రంగా పేరు పొందినది. విద్యావంతుడైన సంత్ స్వామి హరిహర్ తీర్థ్, స్వామీజీకి సిద్ధాంత కౌముది మరియు లఘు కౌముది వంటి ధర్మగ్రంథాల లోతైన జ్ఞానాన్ని బోధించి, ఆశీర్వదించారు. మహామండలేశ్వర్ స్వామి విష్ణుదేవానంద్ గిరిజీ బోధించిన పంచ లక్షిణీ మరియు మథురి జగదీశి అనే టీకాలను (వివరణలను) అధ్యయనం చేశారు. స్వయంభూ స్వామి సూచనతో స్వామీజీ కాశీ (వారణాసి) నుండి వచ్చిన స్వామి ప్రణవానంద వద్ద యోగ విద్యలోని సూక్ష్మతల్ని నేర్చుకున్నారు. ఇది యోగంపై స్వామీజీకి ఉన్న తపనను చాలా వరకు తీరుస్తూ, ఆధ్యాత్మికంగా పరిపక్వతను కలిగించింది. స్వామి ప్రణవానంద, స్వామీజీ యొక్క నిష్ఠ, జ్ఞానతాపత్రయం చూసి ఎంతో ఆశ్చర్యపోయారు. ఆయన, స్వామీజీకి "ఖేచరి ముద్ర" (అత్యంత అరుదైన యోగ సాధన) సహా అనేక యోగ సూత్రాలను బోధించారు. కొన్ని నెలల పాటు అంకితభావంతో చేసిన యోగ సాధన మరియు గురువైన ప్రణవానందపట్ల ఉన్న భక్తితో, స్వామీజీ యోగంలో పరిపూర్ణత సాధించారు.

- సశేషం

భగవన్నామమనెడి దివ్యమణి దీపాన్ని నాలుక అనే గడప మీద వుంచినచో దేహమనే ఇంటిలోపల, బయట వెలుగుల వెల్లువ వెల్లివిరుస్తుంది. అప్పుడు సర్వత్రా మోక్షదాయకమే!

- శ్రీ తులసీదాస్

# శ్రీకృష్ణ కర్ణామృతం

- వై. సావిత్రి

శ్లోకం - **మాతః కిం యదునాథ దేహి చషకం కింతేన పాతుం పయ**
**స్తన్నాస్త్యద్య కదాస్తి వానిశి నిశావాన్ధకారోదయః**
**ఆమీల్యాక్షియుగం నిసాప్యుపగతా దేహీతి మాతర్ముహు**
**ర్వక్షోజాంశుక కర్షణోత కరః కృష్ణస్య పుష్ణాతునః**

భావం - మహాభక్తుడు, వాఙ్మయ కారుడైన శ్రీ లీలాశుకుడు, తన ధ్యాన సమయంలో కలిగిన అనంత అనుభూతులను తానొక్కడే ఆనందించి, అనుభవించకుండా, ఆ అనుభూతులను శ్లోక రూపంలో **శ్రీకృష్ణ కర్ణామృతము** అనే గ్రంథంలో పొందుపరచాడు.

ఆ శ్లోకాలలో ఈ శ్లోకం, శ్రీకృష్ణుని చతురతను ప్రకటించేదిగా వుంటుంది. శ్లోకపాదంలోకి వెడితే, యశోదమ్మ సంకీర్తన చేస్తూ, వెన్న తీస్తూ, తన పనిలో నిమగ్నమై వుంటే, మన చిన్ని కృష్ణయ్య వచ్చి, 'అమ్మా!' అంటూ ఆమె మెడను తన చిన్ని చేతులతో చుట్టి, గారం పోతూ వుంటే, 'ఏమిటి కన్నయ్యా!' అని యశోద అడగగా, 'గిన్నె ఇవ్వు' అని కృష్ణుడు చెప్పగా, 'ఇప్పుడు ఎందుకు?' అని యశోద కారణం తెలిసినా కూడా ముసిముసి నవ్వులతో అడగగా, 'పాలు త్రాగటానికి' అని కన్నయ్య సమాధానం చెప్పాడు.

చిన్ని కృష్ణయ్యను ఆటపట్టించడానికి యశోద 'పాలు ఇప్పుడు ఇవ్వనుగా' అని అన్నది. 'మరి ఎప్పుడు ఇస్తావు?' అని కన్నయ్య మారాం చేస్తే, 'రాత్రికి' అని యశోద సమాధానం చెప్పింది. దానితో కృష్ణుడు బుంగమూతి పెట్టి, కొంచెం ఆలోచించి, 'మరి రాత్రి అంటే ఏమిటమ్మా?' అని అమాయకంగా ప్రశ్నించేసరికి, 'రాత్రి అంటే ... చీకటిగా వుంటుంది అది' అని సమాధానం చెప్పింది యశోద. అప్పుడు మన కొంటె కృష్ణయ్య తన చిన్ని చిన్ని చేతులను తన రెండు కళ్లకు అడ్డం పెట్టుకుని, 'అమ్మా! ఇప్పుడు చీకటైపోయింది పాలు ఇవ్వమ్మా!' అంటూ తల్లి కొంగు పట్టుకుని మారాం చేస్తున్న ఆ చిన్ని కృష్ణయ్య నన్ను కాపాడు గాక! అని లీలాశుకుడు తన ధ్యానంలో దర్శించిన లీలను చక్కగా శ్లోక రూపంలో మనకు ప్రసాదించారు.

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి) -పాలూరి ప్రసాద్

**101. ఓం సిద్ధాయ నమః**

శ్రీ గురుదేవులు సర్వ సిద్ధులను పొందిన వారు. వారు తలంచిన ఏ కార్యమైనను వెంటనే సిద్ధిస్తుంది. అంతే కాక వారిని ఆశ్రయించిన వారి భక్తిని సిద్ధింప చేయుటలో వారు సర్వ సమర్థులు. శ్రీ గురుదేవులను మనసున తలచి ప్రారంభించినచో ఎంతటి కష్ట కార్యమైనా చాలా సులభంగా సిద్ధిస్తుంది.

**102. ఓం ధీరోదాత్త గుణాన్వితాయ నమః**

సమస్త విశ్వమునకు సృష్టికర్తయై అద్వైతసామ్రాజ్య చక్రవర్తులైన సమర్థ సద్గురుదేవులు సర్వజీవకోటి రక్షణభారము వహించుటలో యెంత ఉదాత్తులై వుంటారో ధీరులై ఉంటారో సామాన్యుల ఊహకు అందనిది.

**103. ఓం నిరాఘాట ప్ర భావాయ నమః**

శ్రీగురుదేవుల ప్రభావమునకు (ప్రకాశమునకు, శక్తికి) ఈ జగత్తులో ఎచ్చటను ఎదురు లేదు. వారు తలపెట్టిన కార్యమునకు విఘ్నము కలిగించుటకు త్రిమూర్తులకు సైతము శక్తి లేదు. వారి శిష్యులు ఎక్కడ ఏ పరిస్థితులలోనున్నను ఒకసారి మనసారా ప్రార్థించినంతనే వారు రక్షించగలరు.

**104. ఓం నీతి దూర భయంకరాయ నమః**

శ్రీ గురుదేవులు నీతి తప్పి ప్రవర్తించే వారికి భయము కలిగించి వారి తప్పులను ఎత్తి చూపి వారిలో పశ్చాత్తాపము కలుగునట్లు చేసి వారి మనస్సులో పరివర్తన కలిగించి వారు ఇక ముందు అటువంటి తప్పులు చేయకుండ చేయుటలో సమర్థులు.

**105. ఓం సంసార తాప సంహర్త్రే నమః**

శ్రీ గురుదేవులు తమను ఆశ్రయించిన వారి సంసార తాపములను హరించి తమ యొక్క బోధ ద్వారా వారిలో ఆత్మజ్ఞానాన్ని కలిగించి తరింప చేయుటలో సమర్థులు. అట్టి గురుదేవునికి నమస్కరించుచున్నాను.

**106. ఓం శిష్టాభయ వరప్రదాయ నమః**

శ్రీ గురుదేవులు సజ్జనులైన సాధకులకు అభయమును, అనేక వరములను ప్రసాదింతురు. వారి సాధనలో ఎట్టి ఆటంకము కలుగనీయకుండా కామాది శత్రువులను

జయించుటలో వారికి అభయము ప్రసాదిస్తారు. అలాగే వారి సాధనను ఫలింపచేసి ఆత్మ జ్ఞానాన్ని వరంగా ప్రసాదిస్తారు.

**107. ఓం వేద వేదాంగ సంవేద్యాయ నమః**

వేదాలు, వేదాంగాలు, శాస్త్రాలు, పురాణాలు, ఉపనిషత్తులు, వేదాంత వాక్యాలు – వీటి ద్వారా తెలియబడే ఏ పరాత్పర తత్వం అయితే ఉన్నదో అదే శ్రీగురుదేవుల తత్త్వం. వీటన్నిటిలో వర్ణించబడిన, మనో వాక్కులకు అందనటువంటి, వాటికి ఆధారమైనటువంటి పరబ్రహ్మతత్త్వమే శ్రీ గురుదేవులు.

**108. ఓం సంశ్రితావన తత్పరాయ నమః**

శ్రీ గురుదేవులు తమను ఆశ్రయించిన వారిని ఉద్ధరించుటలో తత్పరులైనవారు. వారు కేవలం ఆశ్రిత జనులను ఉద్ధరించుట కొరకే దేహమును ధరించి అవతరించి ఉన్నారు.

**109. ఓం మిత్రాయ నమః**

శ్రీ గురుదేవులు తమను ఆశ్రయించిన వారికి ఎల్లప్పుడు తోడుగా ఉండి వారిని ఆపదల నుండి రక్షించు మిత్రుని వంటి వారు. అంతే కాక ఎల్ల జీవుల యందు సమానత్వాన్ని ప్రదర్శిస్తూ అందరినీ సమానముగా ఆదరించు సూర్యుని వంటివారు.

**110. ఓం పవిత్ర చారిత్రాయ నమః**

శ్రీ గురుదేవులు పవిత్రమైన నడవడిక కల వారు. అగ్నిని తాకిన వస్తువులన్నీ పరిశుద్ధమైనట్లు వారిని ఆశ్రయించిన వారిని కూడా వారు తమ బోధచేత, ప్రవర్తన చేత పవిత్రులుగా చేయగల సమర్థులు.

- సశేషం

**ఎవరి దివ్య ప్రబోధం భగవంతునిలో అకుంఠిత విశ్వాసాన్ని ప్రదీప్తం చేస్తుందో, ప్రజలకు తమ విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చడానికి ఎవరు ప్రోత్సాహం ఇస్తారో, ఎవరు ప్రజల మానసిక, దైహిక రుగ్మతలను రూపుమాపి ఆధ్యాత్మిక పురోగతికి ఆచరణ యోగ్యమైన పథాన్ని నిర్దేశిస్తారో ఆయనే నిజమైన సద్గురువు!**

- శ్రీ కాళీబాబు

# శ్యామ సుందరా! ఒక్కసారి,
# ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గత సంచిక తరువాయి) - కీ.శే. రమణ ప్రసాద్

'ఎవరూ?... అర్జునా!.... వచ్చావా నాయనా' కంపిత స్వరంతో అంటూ వణుకుతున్న చేతులతో వసుదేవుడు అర్జునుని తల నిమిరాడు. 'నాయనా! కృష్ణుణ్ణి నీతో తీసికొని రాలేదా? బలరాముడెక్కడ? వసుదేవుడు గద్గదమౌతున్న కంఠంతో అర్జునుణ్ణి అడిగాడు. అర్జునుడు వణికి పోయాడు. అతడు నిస్సహాయంగా ద్వారం దగ్గర నిలబడ్డ దారుకుడివైపు చూశాడు. అర్జునుడి చూపులు తనపై పడుతూనే దారుకుడు అక్కడనుండి తప్పుకొన్నాడు.



'తండ్రీ!' వసుదేవుడి పాదాల దగ్గరే వున్న ఆసనంపై కూర్చుంటూ అర్జునుడు వసుదేవుని అనునయిస్తూ 'మీరు స్థిమిత పడండి. ఇక మనం కృష్ణుణ్ణి ఒక రూపంలో కాని, ఒక చోట కాని చూడలేము. కృష్ణుడు ఇప్పుడు తన లీలామానుష విగ్రహాన్ని ఉపసంహరించుకున్నాడు. అయితే మాత్రమేమి? దానివల్ల ఏమైంది? కృష్ణుడు మన ప్రతి అణువులో మన అస్తిత్వంగా నిండి తొణికిసలాడుతున్నాడు. మనందరకు ఇంకా బాగా దగ్గరగా, మనంగా అయి మనలో తాను ప్రకాశిస్తూ మనందరినీ ప్రకాశింపచేస్తున్నాడు' అంటూ దేవకివైపు చూస్తూ 'అమ్మా! మీరు కృష్ణుని కన్నతల్లి కదా....' అన్నాడు. దేవకి మధ్యలోనే అందుకొని 'అవును నాయనా! కాని నేనెంత అభాగ్యురాలను' తనలో తనే అనుకొంటున్నట్లుగా అన్నది దేవకి. అర్జునుడు 'కృష్ణుని తల్లి అభాగ్యురాలెలా అవుతందమ్మా?' అన్నాడు.

"పార్థా! ప్రపంచంలో ఏ తల్లి అయినా తన గర్భవాసాన జన్మించిన శిశువును తన రొమ్ములకు హత్తుకొని మొదటిసారిగా స్తన్యం ఇవ్వకుండా వేరేచోట ఎక్కడో పెరిగి పెద్ద అవమని పంపివేస్తుందా? 'నా కన్నతండ్రీ!' అంటూ ప్రేమతో ఆ పసికందును అక్కున చేర్చుకొని ఆనందాశ్రువులతో మూర్ధాభిషేకం చేయని, కౌగిటిలో చేర్చుకొని కరిగిపోని కన్నతల్లి ఎక్కడైనా..." దేవకి ఆ పైన మాట్లాడలేకపోయింది.

'అమ్మా! మీ పుత్రుడు యశోదాదేవి వద్ద ఎంతో అల్లారుముద్దుగా పెరిగాడని విన్నాను...' అన్నాడు అర్జునుడు.

'అలా అయితే పార్థా! నేను దేవకికి బదులు యశోదను ఎందుకు కాలేదు? నా చిట్టితండ్రికి ఎంతో ఇష్టమైన వెన్న, మీగడ, కలకండలు నా చేతులతో తినిపించే భాగ్యం పోగొట్టుకొన్న దురదృష్ట వంతురాలిని ఎందుకు అయ్యాను? నా బుజ్జి తండ్రిని ఒడిలో పడుకో బెట్టుకొని చిచ్చి కొడుతూ జోలపాటతో నిదుర పుచ్చే సౌభాగ్యం నాకు ఎందుకు లభించలేదు?'... దేవకి గుండెల్లోనుంచి పొంగి వస్తున్న ఏడుపును ఆపుకోలేక హృదయవిదారకంగా విలపించసాగింది.

"అలా అనకు తల్లీ! మీ చేతి వెన్న, కలకండ తినటానికి కృష్ణుడు తిరిగి రావలసిందే" అర్జునుడు దేవకిని ఊరడిస్తూ అన్నాడు.

దేవకి కొంత తమాయించుకొని "అర్జునా! ఒకసారి నా కృష్ణునికి స్వయంగా నా చేతులతో వెన్న, కలకండ తినిపించాలన్న తీవ్రమైన కాంక్ష నాలో కలిగింది. హస్తినాపురం, ఇంద్రప్రస్థం, మధుర, ప్రాగ్జ్యోతిషపురం, సమస్త ఆర్యావర్తం పరిభ్రమణం చేసి నా కుమారుడికి క్షణమైనా శాంతిగా కూర్చునే తీరిక ఉండేది కాదు. ఒకసారి ఎప్పుడో సావకాశం చిక్కినప్పుడు నేను ఇక్కడే... ఈ ఇంట్లోనే నేను స్వయంగా చేసిన పదార్థాలతో భోజనం చెయ్యమని నా కన్నయ్యని పిలిచాను. అతనికి వెన్న, కలకండ మీద వున్న ప్రీతిని గురించి చాలా విని ఉన్నాను కదా! అందుకే నేను అతనికి ప్రత్యేకంగా అపురూపమైన పదార్థం చేసి వడ్డించాను' చెప్పుకుపోతున్నది దేవకి. 'అవునా తల్లీ! అప్పుడు.....అప్పుడేమైంది?' దేవకివైపు చూస్తున్న అర్జునుడి గొంతు గాద్గదికమైంది. అతడు దుఃఖం ఆపుకోలేకపోయాడు.

'ఇక్కడే....ఇక్కడనే....., అదిగో అటు చూడు, అక్కడే...' అంటూ తన వణుకుతున్న చేతితో చూపించి, 'ఇక్కడే నా తండ్రిని కూర్చోబెట్టి, భోజనం వడ్డించిన పళ్ళెం పెట్టాను' వస్తున్న ఎక్కిళ్ళను ఆపుకోవడానికి దేవకికి కొంచెం సమయం పట్టింది. 'కృష్ణుడు వడ్డించిన ఆ పళ్ళెం వైపు చూస్తూ అలా చాలాసేపు ఉండిపోయాడు. అంతే! ఆ తరువాత అతని కళ్ళల్లో నీళ్ళు తిరగటం చూశాను. వెన్న, కలకండలను అతను ముట్టుకోనే లేదు. తల దించేసుకున్నాడు.' 'అమ్మా! మీరేమంటున్నారు? కృష్ణుడు కన్నీరు పెట్టాడా?' అడిగాడు అర్జునుడు.

- సశేషం

# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**భక్తి సూత్రము 54: గుణ రహితం కామనారహితం ప్రతిక్షణ వర్ధమానం అవిచ్ఛిన్నం సూక్ష్మతరం అనుభవ పూర్వకం**



తాత్పర్యము: భగవంతుడి పైన ఉండే ఈ పరమ ప్రేమ గుణ రహితమైనది, కామనా రహితమైనది, క్షణ క్షణ ప్రవర్ధమాన మగునది, అవిచ్ఛిన్నమైనది, సూక్ష్మతి సూక్ష్మమైనది, అనుభవ పూర్వకమైనది. ఈ సూత్రం ద్వారా నారదులు స్వచ్ఛమైన ప్రేమ గుణ రహితమైనది అని తెలియజేస్తున్నారు. ఒకవేళ ఏదైనా గుణమును బట్టి ప్రేమ కలిగినట్లయితే ఆ గుణము లోపించినప్పుడు ప్రేమ తగ్గిపోతుంది. యదార్థమైన ప్రేమకు గుణాపేక్ష ఉండదు. ఆ ప్రేమలో గుణ దోషములు ఎంచడానికి ఆస్కారం ఉండదు. అటువంటి స్వచ్ఛమైన పరమ ప్రేమ త్రిగుణములైన సత్వ రజో తమో గుణములకు కూడా అతీతమైనదిగా ఉంటుందని ఈ సూత్రము తెలియజేస్తోంది.

పవిత్రమైన ప్రేమ కామనా రహితముగా ఉంటుంది. ఆ పరమ ప్రేమయందు తనకు ప్రియమైన వారి సుఖము తప్ప వేరే కోరిక ఏదీ కనిపించదు. అది కామ క్రోధాది గుణములకు కూడా అతీతంగా ఉండి పవిత్రమైన ప్రేమగా పరిగణింపబడుతుంది. స్వచ్ఛమైన ప్రేమ ఎప్పటికీ తరగదు సరి కదా క్షణ క్షణమున ప్రవర్ధమానమై, అభివృద్ధి చెందుతూ ఉంటుంది. అంతేగాక భగవంతుని పట్ల పరమ ప్రేమికుడు తన ప్రేమ ఎప్పటికీ తక్కువైనదిగానే భావిస్తూ, అది నిరంతరము అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో ఉంటాడు. మరి అటువంటి ప్రేమకు తరుగుదల, లేక నాశనం ఎలా వుంటుంది? అందుకే అది అవిచ్ఛిన్నంగా ప్రకాశిస్తూ ఉంటుందని నారదులు ఈ సూత్రంలో తెలియజేస్తున్నారు.

ఈ పరమ ప్రేమ హృదయ కుహరంలో దాగి ఉంటుంది. అందుకే నారదులు పరమ ప్రేమ 'సూక్ష్మతరం' అని తెలుపుతున్నారు. ఇదే అంశాన్ని శ్రీ మాతాజీ వారు తమ బోధనలలో ప్రస్తావిస్తూ నిజమైన భక్తుడు తన భక్తిని ప్రకటితమవ్వాలని భావించకుండా ఎంతో గుహ్యముగా మనసులో దాచుకుంటాడని సెలవిచ్చారు. మరి ఇటువంటి పరమ ప్రేమ వర్ణనలకు అతీతమై కేవలం అనుభవైకవేద్యంగా ఉంటుంది అన్న విషయాన్ని 'అనుభవ పూర్వకం' అని ఈ సూత్రంలో తెలియజేస్తున్నారు. ఇదే అంశాన్ని శ్రీ బాబూజీ మహారాజ్ వారు ప్రస్తావిస్తూ 'పంచదార తీపి ఎలా ఉంటుంది? అని అడిగినప్పుడు ఏమని సమాధానం చెప్పగలరు? తిన్నవాడికే మాత్రమే ఆ తీపి తెలుస్తుంది' అని సెలవిచ్చారు. ఈ విధంగా నారదుల వారు ఈ సూత్రములో పరమ ప్రేమ యొక్క గుణములను వర్ణించారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే భగవంతుని అవ్యాజమైన ప్రేమలో లేశమాత్రముగా

పరమ ప్రేమను గుర్తించవచ్చు.

**భక్తి సూత్రము 55: తత్ప్రాప్య తదేవ అవలోకయతి తదేవ శృణోతి తదేవ భాషయతి తదేవ చింతయతి**

తాత్పర్యము: ఆ ప్రేమను పొందిన పరమ భక్తుడు ఎల్లప్పుడూ దానినే (ఆ ప్రేమకు కారణమైన భగవంతుడినే) చూచుచుండును, దానినే ఆలకించును, దానినే వర్ణించును అలాగే దాని గురించి చింతించుచుండును.

ఈ సూత్రము ద్వారా నారదులు ఆ పరమ ప్రేమామృతమును ఒక్కసారి రుచి చూసిన భక్తుడు నిరంతరము దానిలోనే మునిగి అన్య చింతన లేకుండా తాను ప్రేమించిన భగవంతుడినే నిరంతరమూ తలుస్తూ ఉంటాడన్న ఆ అనన్య భక్తి యొక్క విశేషమును తెలియజేస్తున్నారు. ఆ పరమ భక్తులకి దేనిని చూసినా అన్య వస్తువు కానరాక వారు ప్రేమించిన భగవంతుడి ప్రతిరూపమే కనిపిస్తుంది. దీనికి గొప్ప ఉదాహరణగా గోపికల భక్తిని తీసుకొనవచ్చు. గోపికలు **ఎందెందు నేగందు నందందు శ్యామ ప్రభామయంబు కాన వచ్చె నెల్ల** – అంటూ నందవ్రజములోని అణువణువులో కృష్ణుడిని దర్శించారు.

అటువంటివారు వినునది, అనునది, చింతించునది కూడా ఆ పరమాత్ముని తత్త్వము తప్ప మరొక్కటి ఉండదు. దాని గురించే నారదుల వారు **తదేవ శృణోతి** అంటూ వారు కేవలం ఆ భగవంతుని నామము తప్ప మరేదీ వినరు అని తెలియజేస్తున్నారు. అంటే ఇతరములు అయిన విషయములు ఏవైనా వారికి వినిపించినప్పటికీ వారు వాటిని మనసుకి చేరనివ్వరు. **తదేవ భాషయతి, తదేవ చింతయతి** అంటూ అటువంటివారు నిరంతరము వారు ప్రేమించిన భగవంతుడి గురించి భాషించడం, లేక ఆలోచించడం చేస్తారు అన్న విషయాన్ని తెలియపరుస్తున్నారు. అంతేకాక మరెవరైనా పరమ భక్తులు కనపడితే సత్సంగము చేసుకొనవచ్చు అన్న అభిలాషతో కూడా వారు ఎదురు చూస్తూ వుంటారు. ఆనాడు ప్రహ్లాదుడు **పానీయంబులు త్రాగుచున్ కుడుచుచున్ హాసలీలా నిద్రాదుల్ చేయుచున్** అంటూ పోతనామాత్యులు వివరించినట్లు సతతమూ శ్రీమన్నారాయణ పాదపద్మ యుగళి చింతనతోనే మనసును అనుసంధానం చేసి వుండడము మనందరికీ తెలిసిన విషయమే కదా. రాక్షస వంశంలో పుట్టినప్పటికీ ఆ పరమ భక్తియే ప్రహ్లాదుడిని అంతటి స్థితికి తీసుకొని వెళ్ళింది అనడంలో సందేహం లేదు. గీతాచార్యులు కూడా **యోమామ్ పశ్యతి సర్వత్ర సర్వంచ మయి పశ్యతి** అంటూ నా పరమ భక్తులు ప్రతిదానిలో నన్ను, నాలో ప్రతిదానిని చూసి అనన్యభావనతో తన్మయులై ఉంటారు అని ప్రకటించారు కదా. ఈ సూత్రము ద్వారా నారదులు పరమ భక్తుడు ఇంద్రియములతో వాటి పని చేస్తున్నప్పటికీ మనసు మాత్రము ఎల్లప్పుడూ ఇంద్రియాధీశుడైన హృషీకేశుడి మీదనే లగ్నమై ఉంటుంది అన్న సత్యమును తెలియజేస్తున్నారు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**ఫిబ్రవరి 2026**

1 ఆది: మాఘ పూర్ణిమ. - గురు పూర్ణిమ. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

11 బుధ: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

15 ఆది: మహాశివరాత్రి - తె.జా.3.30 గం. లకు శ్రీ గురుదేవులకు బృందావనములో నమక చమక సహిత రుద్రాభిషేకము. ఉ.5.00 గం.లకు శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయములో సామూహిక ఏకాదశ రుద్రాభిషేకములు. మ.11.00 గం.లకు సహస్ర ఘటాభిషేకము, లక్ష బిల్వార్చన, భక్త సమారాధన. రాత్రి 7.00 గం.లకు శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి సామూహిక కళ్యాణ మహోత్సవం.

16 సోమ: ఉ.11.00 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన. రాత్రి 7. గం.లకు శ్రీ ఉమారామలింగేశ్వర స్వామివారి నగరోత్సవం.

17 మంగళ: అమావాస్య

20 శుక్ర: ఫాల్గుణ శుద్ధ తదియ - శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారి ఆరాధన, సత్సంగం.

**మార్చి 2026**

3 మంగళ: ఫాల్గుణ పూర్ణిమ - హోలీ పండుగ. శ్రీ సద్గురు పాదపూజ.

13 శుక్ర: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

17 మంగళ: మాసశివరాత్రి

19 గురు: అమావాస్య

19 గురు: శ్రీ పరాభవ నామసంవత్సర ఉగాది - ఉ. 10.00 గం.లకు పంచాంగ శ్రవణం, అనంతరం శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

20-26 వరకు మౌన ధ్యాన సప్తాహ శిబిరం

27 శుక్ర - శ్రీరామ నవమి - ఉ. 5-30 శ్రీసద్గురుపాదపూజ, ఉ. 11గం. శ్రీ సీతారాముల సామూహిక కళ్యాణ మహోత్సవము, భక్త సమారాధన

31 మంగళ - ఒంటిమిట్ట కోదండరామస్వామి కళ్యాణ మహోత్సవం - భీమవరం శాఖలో శ్రీసీతారాముల కళ్యాణం.

# నిజరూప దర్శనం

- పెనుమాక నాగేశ్వర రావు

ప్రసిద్ధ ఆలయాల్లో  కొన్ని కొన్ని ప్రత్యేక దినాలలోనే దేవతా మూర్తుల నిజరూప దర్శనానికి అవకాశం వుంటుంది. మిగిలిన రోజుల్లో మనం దర్శించుకునేది నిజరూపం కాదన్నమాట. నిజానికి దేవుడు నిరాకారుడు అని చెబుతుంటారు, అది వేరే కోణం. నిరాకారుడైన పరమాత్మను దర్శించటం సామాన్య మానవుల తరం కాదనే, భక్త వత్సలుడైన భగవంతుడు రకరకాల రూపాలలో అవతరించి. మనకు నేత్రానందాన్ని, మానసిక ఆనందాన్ని, తద్వారా పారవశ్యాన్ని అనుగ్రహించాడని మనం గ్రహించవలసిన విషయం.

తిరుమల పుణ్యక్షేత్రంలో వారంలో ఆరు రోజులు వివిధ రకాల ఆభరణాలు, అలంకారాలతో భక్తులకు దర్శనమిచ్చి అలరించే శ్రీ వెంకటేశ్వరస్వామి ఒక్క గురువారం రోజు మాత్రమే నిజ రూపంలో దర్శించుకునే భాగ్యం భక్తులకు అనుగ్రహిస్తారు. అలాగే సింహాచలం అప్పన్న స్వామి కూడా.

సింహాచలంలో  నిజరూప దర్శనం అంటే, శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామివారి విగ్రహంపై ఉన్న గంధపు పొరను తొలగించి, స్వామివారి అసలు రూపాన్ని భక్తులకు చూపించే అపురూపమైన సందర్భం, దీనిని  చందనోత్సవం అని కూడా అంటారు. ఇది సంవత్సరంలో ఒక్కరోజు, సాధారణంగా అక్షయ తృతీయ రోజు జరుగుతుంది, ఈ రోజున మాత్రమే భక్తులు స్వామివారి నిజ స్వరూపాన్ని దర్శించుకోగలరు.

ద్వారకా తిరుమలలో నిజరూప దర్శనం అంటే, స్వామివారికి అలంకరణలు తొలగించి, కేవలం మేల్చాట్ ఏకవస్త్రం (తిరుపతి నుంచి వచ్చే వస్త్రం), నేతి దీపాల కాంతిలో, విద్యుత్ దీపాలు లేకుండా అసలు రూపంలో దర్శనమివ్వడం, ముఖ్యంగా ముక్కోటి ఏకాదశి  ముందు రోజు సాయంత్రం నుండి ముక్కోటి ఏకాదశి మధ్యాహ్నం వరకు లభిస్తుంది, ఇది భక్తులకు ఒక అద్భుతమైన అవకాశంగా భావిస్తారు.

రాజాం నవదుర్గ ఆలయంలో అమ్మవారి నిజరూప దర్శనం ప్రధానంగా విజయదశమి రోజున మాత్రమే లభిస్తుంది, ఈ రోజున ఉదయం నాలుగు  గంటల నుండి సాయంత్రం వరకు భక్తులు దర్శనం చేసుకోవచ్చు, వేలాది మంది భక్తులు  ఈ అరుదైన దర్శనాన్ని పొందుతారు, ఇది అమ్మవారు అత్యంత తేజోవంతమైన రూపంలో దర్శనమిచ్చే ప్రత్యేక సందర్భం.

ఇదే విధంగా భద్రాచలంలో శ్రీరామచంద్రమూర్తి వైకుంఠ ఏకాదశి రోజున నిజరూప దర్శనం ఇస్తారని చెబుతుంటారు. పళనిలో నిజరూప దర్శనం అంటే, తమిళనాడులోని ప్రసిద్ధ పళని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో దేవుడి అసలైన, దివ్యమైన రూపాన్ని దండాయుధపాణిగా చూడటం, ఇది భక్తులకు అత్యంత అరుదైన, దైవిక అనుభూతిని కలిగిస్తుందని, వారి కోరికలు నెరవేరడానికి, పుణ్యం సంపాదించడానికి ఇది ముఖ్యమని భక్తులు భావిస్తారు.

అయితే మన (బాబుజీ భక్తకోటి) అదృష్టం ఏమిటంటే మనం ఎప్పుడూ సద్గురుమూర్తిని నిజరూపంగానే దర్శించుకున్నాం. శివరాత్రికి ఆయనకే స్వయంగా అభిషేకం చేసుకున్న పుణ్యజీవులం. ముక్కోటి ఏకాదశి రోజున అమ్మగదిలో నుంచి ఉత్తరద్వారం గుండా దర్శనం చేసుకున్న ధన్యజీవులం. గుంటూరు పాండు గారింట్లో స్వామివారిని తులాభారం తూచగా చూసి తన్మయులమైన తరం మనది. దీపావళి పండుగ సందర్భంలో, మరోసారి కూడా ఒకేసారి రెండు చోట్ల దర్శనం చేసుకున్న అనుభవాలు పంచుకున్న మన గురు సోదరులు చెప్పిన సంఘటనలు విని పులకించిన అదృష్టవంతులం.అలాగే తారక పరబ్రహ్మ శాస్త్రి గారి తిరుపతి అనుభవం కూడా గుర్తుచేసుకోవాలి ఈ సందర్భంగా.

నవరాత్రులప్పుడు సద్గురుపూజా మహోత్సవానికి ఏతెంచిన రాజర్షి సమర్థ సద్గురు మూర్తి రాజసాన్ని తిలకించి పులకించిన పుణ్యం మనది. ప్రయాణాలప్పుడు లాల్చీ ధరించిన స్వామి మూర్తిని చూశాం. విదేశాల్లో ఉన్ని దుస్తులు వేసుకున్న ఫోటోల్ని చూశాం. బోధ చేసేటప్పుడు కట్టుకున్న పట్టు ధోవతిని సవరించుకుంటూ ఆయన చెప్పిన చమత్కార వాక్యాలు విన్నాం. ఎవరి అవకాశాన్నిబట్టి వారు, ఎవరెవరి ప్రాప్తాన్ని బట్టి వారు సద్గురు మూర్తి దర్శనం చేసుకున్నవారమే అందరం. ఆయన చిద్విలాసంగా నవ్వుతూ చూసినప్పుడు పరవశించిన మనమే, కొద్దిసార్లు వారి ఉగ్రరూపం చూసి భయపడిన అనుభవం కూడా మనదే.

అభ్యాసము కూసు విద్య అన్నట్లు చిన్నప్పటినుంచి చూసిన బాబూజీ మహరాజ్ రూపమే ఏ పుణ్యక్షేత్రానికి వెళ్ళినా దర్శించుకోవటం, ఆ నామస్మరణనే ఆలపించటం ఆయన అనుగ్రహంగా భావిస్తుంటాం. అందుకే ఏ దేవాలయానికి వెళ్ళినా సద్గురు రూపాన్ని దర్శించుకోవటమే నిజరూప దర్శనం అనిపిస్తుంటుంది. అలాంటి మహాద్భాగ్యాన్ని మనకు ప్రసాదించిన సద్గురుమూర్తి పాదపద్మాలకు ప్రణమిల్లుతూ ............జై సద్గురు మహరాజ్ కు.

# శ్రీ బాబూజీతో నా ప్రయాణం

(గత సంచిక తరువాయి)

- జి. విజయకృష్ణ (బుజ్జి)

మేము చేరుకునే ముందే నా భార్య ఆసుపత్రిలో ఉంది. అంబులెన్స్ సిబ్బందితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నందున, అత్యవసర గది సిబ్బందిని రంగంలోకి దింపారు. నేను అత్యవసర గదికి చేరుకున్నాను. అక్కడ నాడి కేవలం అందుబాటులో ఉండటంతో వారు నేను చేరుకునేటప్పుడు చనిపోయానని ప్రకటించలేదు. అన్ని అడ్డంకులకు వ్యతిరేకంగా నన్ను బతికించడానికి మారథాన్ మరియు రేసుగా జరిగిన దానిలో, అత్యవసర గదిలోని మొత్తం బృందం నా జీవితాన్ని కొనసాగించడానికి అందుబాటులో ఉన్న అన్ని మార్గాలలో పోరాడింది. వైజాగ్ నుండి మాతో వచ్చిన మా కుటుంబ స్నేహితుడు మానిటర్ మూడు సరళ రేఖలను చూపించడాన్ని చూసినప్పుడు భయంతో ఉన్నాడు. అతని గుండె చాలాసార్లు బాధలో మునిగిపోయింది. నన్ను గ్రౌండ్‌ఫ్లోర్‌లో నుండి మూడవ అంతస్తులోని క్యాత్ ల్యాబ్‌కు తదుపరి శస్త్రచికిత్స కోసం మార్చాలని నిర్ణయం తీసుకోగా, ఈ స్వల్పకాలిక పరివర్తనలో నేను బ్రతుకుతానా అని వారందరూ సందేహించారు.

సుమారు 10:30 గంటలకు, నాకు మళ్లీ గుండెపోటు వచ్చింది. ఈసారి వారు నా కుమార్తె మరియు అల్లుడిని పిలిచి, పునరుద్ధరణ అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని, వారు అందరు ముఖ్యమైన బంధువులను కడసారి చూపుకోసం పిలవవచ్చని తెలియజేశారు. వారు నిరంతరం CPR నిర్వహించారు. ఈ గందరగోళం నా తరలింపును ఐదు నుండి ఆరు గంటలు ఆలస్యం చేసింది. అయితే వైద్యులు సాధ్యమయ్యే అన్ని పరిస్థితులను పరిశీలించారు. చివరికి శస్త్రచికిత్స చేయాల్సిన వైద్యుల బృందానికి డాక్టర్ సి. నరసింహన్ నాయకత్వం వహించారు, డాక్టర్ దల్జిత్ సమర్థవంతంగా సహాయం చేశారు. సాధారణ పరిస్థితిలో ఈ వైద్యులతో అపాయింట్‌మెంట్ పొందడానికి రెండు నెలలు లేదా సంవత్సరాలు పడుతుంది. మొదటివారు ప్రపంచంలో అత్యంత డిమాండ్ ఉన్న వైద్యులలో ఒకరు, అయితే రెండవవారు హైదరాబాద్ నగరంలో

అత్యంత డిమాండ్ ఉన్న కార్డియాలజిస్టులు. ఈ ప్రయత్నాలు జరుగుతూ ఉండగా కుటుంబ సభ్యులను కౌన్సెలింగ్ కోసం పిలిచారు.

కౌన్సెలింగ్ రెండు భాగాలుగా ఉంటుంది, సాంకేతిక బృందం శస్త్రచికిత్స యొక్క సాధ్యమైన ఫలితాలను వివరిస్తుంది, ఇది నా విషయంలో తేలింది. పూర్తిగా కోలుకోవడం, బాధాకరమైన ప్రయాణం మరియు దారిలో జరిగిన సంఘటనల దృష్ట్యా ఇది దాదాపుగా తోసిపుచ్చబడింది, బ్రెయిన్ డెడ్ పరిస్థితి, ఇక్కడ నన్ను ఉంచాలనే నిర్ణయం కుటుంబానికి వదిలివేయబడుతుంది, లేదా బహుశా అవసరమైన రోగుల ఉపయోగం కోసం అవయవాలను సేకరించవచ్చు, లేదా నన్ను ECMO (ఎక్స్ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్) లో వుంచి గుండె మార్పిడి కోసం వేచి ఉండాలి, దీనికి వారు సంభావ్య దాత అందుబాటులోకి వచ్చే వరకు వేచి ఉండాలి. ఇది వారి మనోధైర్యాన్ని కదిలించింది. ఆ తర్వాత జరిగిన ఆర్థిక కౌన్సెలింగ్ ద్వారా ఇది మరింత దిగజారింది.

అయితే, వైజాగ్ కేర్ ఆసుపత్రిలో చొప్పించిన ICD పరికరానికి బదులుగా CRT-D పరికరాన్ని అమర్చాలని వారు ప్లాన్ చేశారు. యాదృచ్ఛికంగా వైజాగ్‌లో అమర్చిన కొత్త ఐసిడి పదేళ్ళ పాటు వుంటుందని భావించారు, కానీ అది నాకు హైదరాబాద్‌కు వెళ్ళే దారిలో చాలా షాక్‌లను ఇచ్చింది. దాంతో బ్యాటరీ పూర్తిగా ఖాళీ అయి, మేము చేరుకునే సమయానికి దాని జీవితకాలం ముగిసింది. దానిని పారవేయాల్సి వచ్చింది. వైద్యులు కొత్త పరికరాన్ని అమర్చడానికి లేదా వారి వద్ద అందుబాటులో ఉన్న వాడిన దాన్ని ఉపయోగించడానికి సందిగ్ధంలో పడ్డారు. ఎందుకంటే వారు నా మనుగడ అవకాశాలను చాలా తక్కువగా భావించారు. చాలా తక్కువ మనుగడ అవకాశాల కోసం నా కుటుంబంపై కొత్త పరికరానికి భారీ బిల్లుతో భారం పడకూడదని కోరుకున్నారు. చివరికి వారు కనీస అవశేష జీవితకాలం కలిగిన పరికరాన్ని దానం చేసి, నేను ఆ కష్టకాలం నుండి బయటపడితే, దానిని సకాలంలో క్రొత్తదానితో మార్చాలని నిర్ణయించుకున్నారు.

- సశేషం

# నిరీక్షణ

(గత సంచిక తరువాయి)

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

సీతమ్మ పాదములకు సాష్టాంగనమస్కారములు చేసిన హనుమంతుడు, "అమ్మా! నేను రాముని దాసుడను. వాయుపుత్రుడనైన నా పేరు హనుమంతుడు. నన్ను నమ్మవలయును. మీకు, ఆయనకు మాత్రమే తెలిసిన కొన్నివిషయములను ఆయన కోరినట్లే మీకు తెలియజేస్తానని చెప్పి రాముడు కోరినట్లే ఆమెకు ఒక్కొక్కటిగ వాటినన్నింటినీ వివరించాడు. వానిలో ఒక్కటి పెరియాళ్వారులు వర్ణించిన తీరును గమనించెదము.

"కలువపుష్పముల మాలవంటి సున్నితమైన తిరువేని గలవారా! పద్మమువంటి నేత్రములు కలిగి చూపులతో గేలంవేయు గుణముగల లేడివంటివారా! సేవకుని విన్నపమును ఆలకించి అనుగ్రహించండి. మహావిష్ణువు శ్రీదేవితో ఏకాంతమున ఆనందముగనుండు సమయమందు, రాత్రివేళ, ఒక మల్లిపూలమాలతో ఆమెను చుట్టివేసిన సంఘటన ఒక చిహ్నమగును"

ఇచ్చట ఒక చిన్న వివరణ గలదు. పంచవటియందు ఒకమారు మహావిష్ణువైన రాముడు, లక్ష్మీదేవియైన సీత ఒక పోటీ పెట్టుకున్నారు. ఎవరైతే ఆ పోటీలో ఓడిపోతారో వారిని గెలిచినవారు ఒక స్తంభమునకు కట్టివేయవలయును. ఆ పోటీలో గెలిచిన సీత తన భర్తయైన రాముని త్రాటితో నొప్పి పెట్టు విధమున కట్టగలదా!? కావున ఏకాంతముగ నున్న ఒక రాత్రివేళలో ఎవ్వరూ లేని సమయమున ఒక మల్లెపూల తీగను తీసుకుని వచ్చి ఆతనిని కట్టివేసింది.

ఇలా అనేకమైన ఆంతరంగికమైన సంఘటనలను తెలుపుటయే గాక హనుమంతుడు తనకు రాముడు ఇచ్చిన అంగులీయకమును ఆమెకు కడు భక్తితో అందజేసాడు. దానిని చూసిన సీత హృదయము ఆనందోత్సాహముతో ఉప్పొంగ, హనుమంతుని మనసారా ఆశీర్వదించి, "నాబాధను తుడిచివేసిన నీవు దీర్ఘాయుస్సును పొందెదవుగాక!' అని చెప్పింది. హనుమంతుని 'జానకీ శోకవినాశకుడు' అనిభక్తులు కొనియాడెదరు. ఆతని గొప్పదనము లెక్కింపనలవిగానిది. ఈ భూమండలమందు పురుషులంతా హనుమంతునివలె అబలులైన స్త్రీలయొక్కబాధలను తీర్చినచో ఎంత బాగుండును!

"నీవు ఎలా సముద్రమును దాటి ఈలంకకు రాగలిగావు?" అని సీత హనుమను ప్రశ్నించగ, హనుమంతుడు తన స్థూలరూపమును ఆమెకు కాన్పరచాడు.

సంతసించిన ఆమె తన నుదుటనున్న పాపిడిపిందెను (చూడామణిని) ఆతనికి ఇచ్చి, దానిని రాముని వద్ద భధ్రముగచేర్చమని చెప్పింది." నా భర్తకు నేనింక ఒక మాస కాలము మాత్రమే వేచి చూస్తానని చెప్పు" అన్నది.

"అమ్మా! ఒక మాసమేమిటి? ఇప్పుడే నేను కొండపైనున్న రాముని వద్దకు మిమ్ములను చేర్చివేయగలను. రండి! కూర్చోండి! మీకు వాహనమగు అవకాశము నాకు ఇవ్వండి!" అన్నాడు హనుమ.

"నా ప్రియ పుత్రా! అలా వద్దులే! రావణునివలె దొంగతనముగ నేను నా భర్త వద్దకు చేరినట్లైతే అది ఆతని వీరత్వమునకు మచ్చ కలిగించును. కావున నా భర్తయే ఇచ్చటకు వచ్చి, రావణుని ఓడించి నన్ను తీసుకొనిపోవుటయే ఆతనికి ఘనతనిచ్చును"

సీతయొక్క ఉన్నత గుణమునకు ఆశ్చర్యం చెందిన హనుమ, "అటులనే మాతా! కలతను విడువుము. సుగ్రీవుని వానర సైన్యములో నాకంటే పదిరెట్లు బలముగల వారెందరో ఉన్నారు. మేమంతా తండ్రి రామునితోను, సహోదరుడు లక్ష్మణునితోను ఇచ్చటకు వచ్చి ఆ అసురుడ్ని ఓడించెదము" అన్నాడు.

ఈ సంఘటనను ఆదికవి వాల్మీకి ఈవిధంగా వివరించారు. "స్త్రీ శిరోమణీ! నీ భర్త శత్రువులను నశింపజేయగల పరాక్రమశాలి. ఆతడు విజయమును పొందగలడు. నీవుతప్పక ఆతనిని చేరుకొందువు. వనవాసం ముగిసి విజయవీరునివలె అయోధ్యకు తిరిగివెళ్ళిన పిదప మీరిరువురూ ఎన్నటికీ వీడని విధమున పట్టాభిషేకము జరుగును"

ఇవ్విధమున హనుమంతుడు మిక్కిలి రమ్యముగ రాముని పట్టాభిషేకమును గూర్చి ఆమెకు వివరించాడు. సౌందర్యవంతమైన రాముని పట్టాభిషేక దృశ్యమును కడు సుందరముగ ముందుగనే సీతకు వివరించాడు సుందరాకాండ నాయకుడు, సుందరుడు అని పిలువబడు హనుమంతుడు.

పిదప అశోకవనమునుండి నిష్క్రమించి, లంకాధిపతి బలమును తెలుసుకొను నిమిత్తమై, ఆ నగరములోనికి ప్రవేశించాడు వాయువేగముతో ఆ వాయుపుత్రుడు.

- సశేషం

**నా ఎదురుగా గురువు, భగవంతుడు ఇద్దరూ నిలిచినచో ముందుగా గురువుకే పాదాభివందనం చేస్తాను. ఎందుకంటే, భగవంతుని దర్శించే మార్గము గురువే తెలిపారు. అందుకే భగవానుని కంటే నాకు గురువే ఎక్కువ**

- భక్త కబీర్‌దాస్

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్ శాఖ వారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

**ఫిబ్రవరి 2026**

1 ఆది: మాఘ పూర్ణిమ. – ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

11 బుధ: శ్రీ గురుదశమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

15 ఆది: మహాశివరాత్రి – ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**మార్చి 2026**

**3 మంగళ: ఫాల్గుణ పూర్ణిమ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**13 శుక్ర: శ్రీ గురుదశమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**19 గురు: శ్రీ పరాభవ నామసంవత్సర ఉగాది – ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**ఫిబ్రవరి 2026**

1 ఆది: మాఘ పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ.

11 బుధ : శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ.

15 ఆది: మహాశివరాత్రి – శ్రీ సద్గురు పాదపూజ.

**మార్చి 2026**

3 మంగళ: ఫాల్గుణ పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ.

13 శుక్ర: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ.

19 గురు: శ్రీ పరాభవ నామసంవత్సర ఉగాది – శ్రీ సద్గురు పాదపూజ.

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**గురు వక్త్రే స్థితం బ్రహ్మ ప్రాప్యతే తత్ప్రసాదతః**
**గురోర్ధ్యానం సదాకుర్యాత్ పురుషం స్వైరిణీ యథా. 40**

**<u>పదవిభాగము</u>** :-

గురువక్త్రే-స్థితం-బ్రహ్మ-ప్రాప్యతే-తత్ప్రసాదతః-గురోః-ధ్యానం- సదా కుర్యాత్-పురుషం-స్వైరిణీ-యథా.

**<u>టీక</u>** :- గురువక్త్రే=గురుదేవుని ముఖమునందు; స్థితం=నెలకొనివున్న; బ్రహ్మ=బ్రహ్మ జ్ఞానము; తత్ ప్రసాదతః= ఆయన దయ వలననే; ప్రావ్యతే=పొందబడుతున్నది; (అందుచేత) యథా=ఏవిధముగ; పురుషం=విటుని, స్వైరిణీ= పరపురుషునియందనురక్త యైన కాముకురాలి వలె; గురోః=గురుదేవుని; ధ్యానం=ధ్యానమును, సదా=ఎల్లపుడు, కుర్యాత్=చేయవలెను.

**<u>వ్యాఖ్య</u>** :- "గురుదేవుని ముఖము బ్రహ్మ జ్ఞానమునకు నిలయము, ఆ జ్ఞానమును ఆయన దయచేత మాత్రమే పొందవచ్చును, అందుచేత కాముకురాలైన స్వైరిణి ఏవిధముగ తన కిష్టమైన విటుని మీద మనస్సు నిల్పుతుందో అంత గాఢముగానూ, గురువును ధ్యానించవలెను" అని గురువును ధ్యానించవలసిన విధానాన్ని తెలియజేస్తున్నాడు పశుపతి. పర పురుషుడితో సంబంధం ఏర్పరచుకొని, వాడితో కామ సౌఖ్యాన్ని అనుభవిస్తూన్న ఇల్లాలు తన యింట్లో గృహకృత్యాలు నిర్వహిస్తున్నప్పటికీ, మనస్సు మాత్రం ఆ పురుషుడి మీదనే ఉంచి, మనస్సుతో వాడితో అనుభవించే సుఖాన్నే ఎలా స్మరిస్తూ, ఆనందిస్తూ ఇంటి పనులను అలవాటు ప్రకారం, గబగబా చేస్తూ ఉంటుందో అలాగే గురుసేవలో నిష్ణాతుడైన శిష్యుడు అంతః శత్రువులైన కామాదులను జయించి, గురుముఖస్థంగా బ్రహ్మ జ్ఞానాన్ని పొంది, లోక వ్యవహారాలు అలవాటు ప్రకారం చేస్తూ ఉన్నప్పటికీ, ఏ చీకూచింతా లేకుండా లోపల మాత్రం గురుధ్యానం చేస్తూ ఉంటాడు. అలా స్వైరిణి తన

ప్రియునివలె, శిష్యుడు గురుధ్యానం నిరంతరం చెయ్యాలని సూచించాడు పరమేశ్వరుడు. ఏకాగ్రతకు ఉదాహరణగా స్వైరిణి చిత్తాన్ని చెప్పటం శాస్త్ర ప్రసిద్ధమే. ఈ విషయాన్నే శ్రీ విద్యారణ్యులు.

*సరవ్యసనినీ నారీ వ్యగ్రాపి గృహకర్మణి*

*తదేవాస్వాదయ త్యంతః పరసంగ రసాయనః*

అని తమ పంచదశిలో వివరించారు, ఇంత మంచి విషయాన్ని బోధించటానికి అటువంటి నీచమైన ఉపమానం చెప్పవచ్చునా? కాని చెప్పినది లోకంలో అందరికీ తెలిసిన దృష్టాంతం, దృష్టాంతాన్ని ఎంత వరకూ గ్రహించాలో అంతవరకు మాత్రమే గ్రహించాలి. ఇక్కడ సాదృశత్వము ఏకాగ్రతా భావం వరకే పరిమితమని గ్రహించాలి. ఇది అలంకార ప్రయోగ ప్రయోజనమూ, ధర్మమూ కూడా.

- సశేషం

**భూమిపై వున్న అన్ని జీవరాశులలోకి మానవజన్మ మహోత్కృష్టమైనది. కేవలం తినడం, త్రాగడం, సుఖించడం, ధనం ఆర్జించడమే మానవ జన్మకి పరమార్థం కాదు. భగవానుడు ఈ క్షణిక సుఖాల కోసం ఈ మానవ జన్మను ప్రసాదించలేదు. అజ్ఞానపు పొరలను, అరిషడ్వర్గాలను ఛేదించుకుని, జ్ఞానరాశులను ప్రోగు చేసుకుని, ఆత్మ సాక్షాత్కార సాధనతో దైవసాన్నిధ్యం పొందడమే మానవ జీవిత పరమ లక్ష్యము.**

- శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్

(గత సంచిక తరువాయి)

# గురుకృప

కీ.శే.- వై. లక్ష్మీనరసమ్మ

కొద్ది రోజుల తర్వాత బిడ్డతో అత్తవారింటికి వెళ్ళబోతూ నరసమ్మగారు శ్రీబాబు దర్శనార్థం వెళ్ళి శ్రీబాబుతో తమ అత్తగారికి శ్రీబాబు ఏరకంగా బిడ్డకి పునర్జన్మ ప్రసాదించారో ఒక ఉత్తరం ద్వారా చెప్పానని, దానికి ప్రత్యుత్తరంలో బిడ్డకి ఏదైనా తాయెత్తు కాని, విభూతి కాని మిమ్మల్ని అడిగి తీసుకు రమన్నారు అని అంటే దానికి సమాధానంగా శ్రీబాబు, "భగవంతుడికి అనంతకోటి నామాలు. ఏ నామంతో పిలిచినా పలుకుతాడు, నీకు బిడ్డ గురించి భయంవేస్తే ఒడిలో పెట్టుకుని భగవన్నామం చేసుకో" అని అభయం ఇచ్చారు. నరసమ్మగారి తండ్రి శ్రీబాబుతో, "మృత్యువుని జయించి పుట్టింది కాబట్టి 'జయకాళి' అని పేరు పెట్టుకుంటాం బాబు" అంటే శ్రీబాబు, "బిడ్డ మేనత్తకు తన పేరు పెట్టుకోవాలి అని ఉంది కాబట్టి రిజిస్టర్‌లో సుబ్బలక్ష్మి' అని రాయించి 'జయకాళి' అని పిలుచుకోండి" అని అన్నారు.

1960 సం॥లో పెద నరసింహంగారు కాలం చేసినప్పుడు సీతమహాలక్ష్మిగారు ఏడుస్తుంటే భీమవరం తాతయ్యగారింట్లో ఉన్న శ్రీబాబు ఆవిడను పిలిచి, "ఆయన భగవసాన్నిధ్యం పొందారు, అందుకని ఆయన ఆత్మశాంతి కోసం నువ్వు ఏడవకూడదు, కంటి నుంచి నీరు రాకూడదు, భగవద్గీత 18 అధ్యాయాలు పారాయణ చేయి, గరుడ పురాణం చదువు" అని చెప్పి వారు చదువుతుండగా మధ్యమధ్యలో తాతయ్యగారింట్లో వారి గది కిటికీ నుంచి చూసేవారు.

ఏ జీవిని ఏరకంగా అనుగ్రహించాలో ఆ పరమాత్మడికే ఎరుక. తననే అనన్య భక్తితో పూజించే జీవిపై తన పరమనుగ్రహాన్ని వర్షింపజేస్తాడు. నరసమ్మగారి భర్త రమణమూర్తిగారు శ్రీబాబు యెడల భక్తి, శ్రద్ధలతో ఉండేవారు. ఆయనకి హార్ట్ ఎన్లార్జ్ (గుండె సంబంధిత వ్యాధి) వచ్చింది. అది తీవ్ర ఇబ్బంది పెడుతూ ఉండేది. పరిస్థితి తీవ్రమై ఆయన చేస్తున్న ఉద్యోగానికి 2సంవత్సరాలు సెలవు పెట్టి ఇంట్లోనే ఉండాల్సి వచ్చింది. జయంతులలో శ్రీబాబు దర్శనార్థం వెళ్ళినప్పుడు రమణమూర్తిగారు శ్రీబాబుతో, "నా పరిస్థితి తీవ్రంగా ఉంది బాబు, విపరీతంగా బరువు తగ్గిపోతున్నా. నాకు మీరే మందివ్వండి" అంటే శ్రీబాబు, "నీకు ఏం భయం బాబు, నువ్వు నా దగ్గరే ఉంటావు, కానీ ఆ తల్లీ, పిల్లని చూసేవారే లేరు, చెట్టు మీద పక్షికైనా ఆధారం ఉంది కానీ వాళ్ళకు ఆధారంలేదు, ప్రయత్నించాను కానీ కుదరలేదు మానవుడు అన్యాయం చేసినా మాధవుడు అన్యాయం చేయడు. ఆ తల్లీ, పిల్లను నేను చూస్తాను అని కంకణం కట్టుకుంటున్నాను" అని అభయమిచ్చారు.

1961లో నరసమ్మగారి మీద గోధుమత్రాచు పడితే వాళ్ళ అత్తగారు "గుండుగొలనులో దసరా పూజలు జరుగుతున్నాయి. ఒకసారి వెళ్లి శ్రీబాబు దర్శనం చేసుకురా" అని అన్నారు. గుండుగొలనులో భోజనాల బంతిలో నరసమ్మగారిని చూసిన శ్రీబాబు, "అతను రాలేదా అమ్మా?!" అని అడిగారు. "ఆయాసం ఎక్కువగా ఉంది బాబు, ఆహారంగా పేలాల జావ మాత్రమే తీసుకుంటున్నారు, వారానికి 2 పౌనులు తగ్గిపోతున్నారు. అందుకే ఆయన రాలేదు" అని నరసమ్మగారు ఇంకా చెప్పబోతుంటే శ్రీబాబు, "బాగోలేదు కాబట్టే రమ్మన్నానమ్మా" అని అప్పటికప్పుడు భీమవరం తాతయ్యగారి (శ్రీ పాలూరి శ్రీరామమూర్తిగారు) చేత రమ్మని ఉత్తరం వ్రాయించారు. ఆ ఉత్తరం అందుకున్న రమణమూర్తిగారు, "శ్రీబాబే నన్ను రమ్మన్నారు, ఏమైనా సరే నేను వెళ్ళిపోతాను" అంటే ఆయన తల్లి "ఒక్కడివే వెళ్ళలేవు నేనూ వస్తా" అని వచ్చారు. వచ్చాకా శ్రీబాబు మూర్తిగారితో, "జగన్మాత ప్రసాదం ఏది తినాలి అనిపిస్తే అది తిను బాబు, నీకు ఏ పత్యం అవసరం లేదు" అని అన్నారు.

నవరాత్రులలో ఒకరోజు మూర్తిగారి తల్లిగారికి స్వప్నంలో జగన్మాత కనిపించి, "ఇక నుంచి నీ బిడ్డ నా బిడ్డ" అని చెప్పి మూర్తిగారిని తన వెంట తీసుకుపోతున్నట్టు కనిపించింది. నవరాత్రులలో ప్రతిరోజు శ్రీబాబు భోదామృతం చెబుతున్న సమయంలో తమ దివ్య చరణాలవిందముల దగ్గర మూర్తిగారిని కూర్చోబెట్టుకుని గురుపాదసేవ భాగ్యం కల్పించేవారు. శారీరక రుగ్మతకు ఔషదం వాడుతున్నా కూడా ప్రతిరోజు జగన్మాత తీర్థప్రసాదాలు ఇస్తూ మూర్తిగారికి అనారోగ్యమును గురించి ఎట్టి ఆలోచన గాని, ఆరాటంగాని లేకుండా ప్రశాంతంగా ఉండే విధంగా శ్రీబాబు అనుగ్రహించారు. అక్కడ ఉన్న కొద్ది రోజులు కూడా మూర్తిగారు అనన్య భక్తి విశ్వాసములతో నిరంతరం గురునామ స్మరణ చేసుకునే భాగ్యాన్ని శ్రీబాబు ప్రసాదించారు.

పౌర్ణమి పూజ వరకు ఉన్న తరువాత ఇంటికి వెళ్ళడానికి భయపడుతున్న నరసమ్మగారితో శ్రీబాబు, "ఏ భయం వద్దు నేను ఉన్నాను, మీరు వెళ్ళండి. నేను కూడా భీమవరం వచ్చేస్తున్నా" అని అభయం ఇచ్చి పంపారు. ఇంటికి వచ్చిన రోజున మూర్తి గారు తమ కుటుంబ సభ్యులతో రాత్రంతా శ్రీబాబు కబుర్లే చెబుతూ, "శ్రీబాబుని చూడని జన్మ వ్యర్థం, నాకు ఏ మందులు అవసరంలేదు, శ్రీబాబు కుంకుమ, అక్షింతలే నాకు పరమ ఔషదం" అని చెబుతూ ఆ మర్నాడు ఉదయం తమ పాంచభౌతిక శరీరాన్ని విడిచి గురు పరమాత్మలో చేరిపోయారు.

- సశేషం

# శ్రీ బాబూజీతో నా అనుభవాలు

(గత సంచిక తరువాయి)

- ఇందుకూరి శర్మిష్ఠ

మేము కాకినాడలో మా పెద్ద అబ్బాయి దగ్గర ఉంటున్నాము. నేను తరచూ ఎక్కడపడితే అక్కడ పడిపోతుండేదాన్ని. తెలిసిన డాక్టరుగారికి చూపిస్తే, హైదరాబాదు తీసుకువెళ్ళి స్కానింగ్ చేయించమన్నారు. స్కానింగు చేసిన తరువాత హైదరాబాద్ డాక్టరుగారు "లో బీ.పి. వలన" అని చెప్పి మందు వ్రాసి యిచ్చారు. మా వారు నన్ను కాకినాడలో దింపి పనిమీద ఒరిస్సా వెళ్ళారు. నన్ను చూడటానికి మా తమ్ముడు, మా అమ్మాయి వచ్చారు.

నా పరిస్థితి ఏమీ బాగాలేదు. కాకినాడ డాక్టరుగారు చూసి నా పరిస్థితి బాగోలేదు అని మా తమ్ముడుతో చెప్పారు. మా తమ్ముడు నన్ను ఆశ్రమానికి (నంబూరు) తీసుకు వచ్చాడు. మేము వచ్చేసరికి శ్రీ మాతాజీ కట్టమూరు సత్సంగానికి వెళ్తూ "ముఖంలో ప్రేత కళ కనిపిస్తోంది" అన్నారు. మా తమ్ముడు శివాలయంలో అభిషేకాలు చేయిస్తాను అంటే, మాతాజీ వచ్చాక అడిగి చేయిద్దాము అన్నాను. మాతాజీ వచ్చేసరికి నాలుగు రోజులు పట్టింది. నేను కదలలేని స్థితిలో ఉన్నాను. తమ్ముడు బ్యాంకుకు వెళ్ళిపోయాడు. మాతాజీ కట్టమూరు నుంచి వచ్చారని తెలిసి, అలాగే కూర్చుని లేస్తూ మాతాజీ ఇంటికి చేరుకున్నాను.

మాతాజీ నా పరిస్థితి తెలిసి, తనే క్రిందకు దిగివచ్చి, 'తమ్ముడు అభిషేకాలు చేయిస్తానంటే ఎందుకు వద్దన్నావు?' అని అడిగారు. నేను 'తమతో చెప్పి మృత్తిక లింగానికి చేసుకోవాలని ఉంది' అన్నాను. 'ఎందుకలా అనుకున్నావు?, ఎవరైనా చెప్పారా' అని అడిగారు. 'లేదమ్మా, ఒంట్లో బాగోటం లేదుకదా, అని నేనే అనుకున్నాను' అని చెప్పాను. 'ఖర్చవుతుందమ్మా ఫరవాలేదా?' అని అడిగారు. 'ఖర్చయినా ఫరవాలేదు' అన్నాను. 'సరే మురళీకి చెప్తాను' అని, అన్నీ వివరముగా వ్రాసి ఇంటికి పంపించారు.

నేను మాతాజీ ఇంటిలోనుంచి బైటకు వచ్చి నడవలేక పోతుంటే, ములగాల ప్రసాదు చెయ్యిపట్టుకుని ఇంటికి తీసుకువెళ్ళాడు. బ్యాంకు నుంచి వచ్చిన తరువాత చీటీ చూసుకుని, మురళీ, ములగాల ప్రసాదు ఇద్దరూ కలిసి గుంటూరు వెళ్ళి షాపు వెనుకనుంచి తీయించి (ఆరోజు బంద్ మూలంగా షాపులు తియ్యలేదు), దగ్గర కూర్చుని యంత్రం చేయించుకుని వచ్చారు. ఈ లోపు పుట్టమట్టి కూడా తీయించి, జల్లించి కామేశ్వరక్కకు పంపాడు. వాళ్ళ బావగారికి నాపరిస్థితి ఫోనులో చెప్పాడు.

మర్నాడు, ఆ తర్వాత రోజూ కూడా తమ్ముడే మహన్యాసానికి కూర్చుని, చివరిలో నాతో అభిషేకం చేయించారు. మా వారు వచ్చి మూడవరోజు నుంచి అభిషేకానికి కూర్చున్నారు. 11 రోజులు అభిషేకాలు పూర్తయినాయి, నాకు తృప్తి కలగక మాతాజీ అనుమతితో 15వ రోజు వరకు చేసుకున్నాము. తర్వాత కొన్ని రోజులు ఉండి కాకినాడ వెళ్ళాము. అక్కడి డాక్టర్లు నేను కోలుకోవటం చూసి ఆశ్చర్యపోయి, మీ గురుదేవులెవరో గాని చాలా గొప్పవారు అన్నారు.

మా అత్తగారు రమ్మన్నారని మావూరు పడమర విప్పర్రు వెళ్ళాం. ఒక రోజు రాత్రి నిద్రలో ఉండగా గోధుమత్రాచు పాము వచ్చి కరిచింది. మెలుకవ వచ్చి లేచి దుప్పటి దులిపేసరికి పాము క్రిందపడి వేగముగా బైటకు వెళ్ళిపోయింది. మావారిని నిద్రలేపి చెప్తే, ఊళ్ళో పసరు మందు యిచ్చేవారిని కలిసి మందు తెచ్చి త్రాగించారు. మిరియాలు నూరి కళ్ళలో పెట్టారు (పాము కాటుకు ఇది విరుగుడు మందు). నిద్రపోవద్దని చెప్పారు. సాయంత్రం అయ్యాక మా తమ్ముడికి ఫోను చేసి మాతాజీకి తెలియజేయమని చెప్పాను. మాతాజీ ఊళ్ళో లేరని ఫోను చేసి చెప్తే, రామలింగేశ్వర స్వామికి విషసర్ప దోష నివారణార్థం 11 రోజులు ఏకాదశ రుద్రాభిషేకం చెయ్యమన్నారు. మేము వచ్చే లోపే మా తమ్ముడు అభిషేకం చేయించి తీర్థం తెచ్చి యిచ్చాడు. మర్నాటి నుంచి మేము అభిషేకం చేసుకున్నాము. మాతాజీ వచ్చేసరికి 15 రోజులు పట్టింది. రాగానే 'ఎలా వున్నావు?' అని అడిగారు.

- సశేషం

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***ఫిబ్రవరి 2026 :*** AS 5475, 7233, 8641, 8642, 8643, 9298, 9299, 9300, PK 0111

***మార్చి 2026 :*** AS 2802, 5338, 7065, 7244, 7685, 7687, 8393, 8676,8679, 9303,9304, 9306, 9307, 9308, 9309

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ గండికోట వేంకటేశ్వర్లు గారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

వెంకటేశ్వర్లుగారు తమ రెండవ కుమారునికి కేశ ఖండనం జరిపి శ్రీబాబుచే అక్షరాభ్యాసం చేయించవలెనని సంకల్పించారు. అప్పుడు శ్రీబాబు చీరాలలో వున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా సముద్ర స్నానం కోసము, వ్యాసపూర్ణిమ సందర్భంగా శ్రీ సద్గురు పాదపూజ కోసము ఎందరో భక్తులు చీరాలలో నూనె వెంకటస్వామిగారి యింటికి వచ్చి ఉన్నారు.



వెంకటేశ్వర్లుగారు సకుటుంబంగా చీరాల వెళ్ళారు. పిల్లవానికి కేశ ఖండనం చేయించారు. శ్రీబాబుకు నమస్కారం చేయించవలెనని ప్రయత్నించారు గాని దర్శనం కాలేదు. అంతలో యింటి వారు వచ్చిన అతిథులందరికి భోజనాలు వడ్డించి, వెంకటేశ్వర్లుగారి కుటుంబాన్ని కూడా భోజనానికి కూర్చోమన్నారు. శ్రీ బాబు దర్శనం లభించేవరకు ఆగటం అంటే యింటి వారికి అసౌకర్యం కలిగించటమవుతుందని వెంకటేశ్వర్లుగారు భోజనానికి కూర్చున్నారు.

వారు సరిగా భోజనానికి ఉపక్రమించే సమయానికి శ్రీ బాబు మేడపై నుండి వారి వైపు చూస్తూ "వెంకటేశ్వర్లుగారూ!" అని పిలిచారు. వెంకటేశ్వర్లుగారు భోజనానికి కూర్చున్నందున సిగ్గుపడుతూనే తలపైకెత్తి "బాబూ!" అన్నారు. "పిల్లవానికి కేశ ఖండనం చేయించారా?" అని శ్రీ బాబు అడిగారు. "చేయించాము బాబూ!" అన్నారు వెంకటేశ్వర్లు గారు. "మరి వాడితో నాకు నమస్కారం చేయించలేదేమిటి?" అన్నారు శ్రీ బాబు. వెంకటేశ్వర్లుగారు విషయం వివరించి, "ఇదిగో వస్తున్నాము బాబూ!" అని లేవబోయారు. అయినా, నేనిప్పుడే గడ్డం చేసుకున్నాను. ఇంకా స్నానం చేయలేదు. ఇప్పుడు మీరు వచ్చి నన్ను ముట్టుకుని నమస్కారం చేసుకుంటే మైలపడిపోరూ? బ్రాహ్మణులు కాదా?" అన్నారు. వెంకటేశ్వర్లుగారు "మిమ్మల్ని తాకితే పోయే బ్రాహ్మణత్వం నాకు వద్దు బాబూ!" అంటూ యజ్ఞోపవీతమును తీసివేయబోయారు. శ్రీ బాబు వద్దు లేవయ్యా! యజ్ఞోపవీతం మెడలో ఉన్నంత మాత్రాన బ్రాహ్మణత్వం వచ్చిందీ లేదు, అది తీసివేసినంత మాత్రాన పోయేదీ కాదు. పోయేదైతే అది బ్రాహ్మణత్వమే కాదు. స్నానం చేసిన తరువాత పిలుస్తాను. భోజనం చెయ్యండి" అన్నారు. ఆ తరువాత శ్రీబాబు పిల్లవానికి అక్షరాభ్యాసం కూడా చేసి ఆశీర్వదించారు.

వెంకటేశ్వర్లుగారి కుడి కంటికి ఏదో వ్యాధి వచ్చి, కంటి చూపు యించుమించు పూర్తిగా పోయింది. ఎన్ని వైద్యాలు చేసినా ఫలితం లేకపోయింది. శ్రీ దేవీ శరన్నవరాత్రి పూజలకు వచ్చినపుడు వెంకటేశ్వర్లుగారు శ్రీ బాబుతో తమ కంటి విషయం చెప్పారు. శ్రీ బాబు నవ్వి ఊరుకున్నారు. పూజలు పూర్తి అయి, దీక్షా విరమణ జరిగిన రోజున శ్రీ బాబు అందరిపై ఆశీర్వచన అక్షతలు చల్లుతున్నారు. ఒక అక్షత గింజ సరిగా వెంకటేశ్వర్లుగారి కంటి గుడ్డుకు తగిలింది. కొంచెంసేపు నీరుకారింది. తుడుచుకునే సరికి కంటి చూపు మామూలుగా వచ్చేసింది.

ఉద్యోగ విరమణ అనంతరం వెంకటేశ్వర్లుగారు ఆశ్రమంలోనే స్థిర నివాసులైనారు. ఇతర ధ్యాసలన్నీ విడిచి, నిరంతరము శ్రీ బాబు చింతనలో మనసు నిలుపుకున్నారు. దంపతులిరువురు వానప్రస్థాశ్రమ జీవితం గడుపుతూ సద్గురుసేవలో సమయం సద్వినియోగం చేసుకునేవారు.

1991 డిసెంబరులో వెంకటేశ్వర్లుగారికి సుస్తీ చేసింది. ఆశ్రమ హాస్పిటల్‌లో చేర్చారు. అక్కడ కూడా తమ గదిలో ఎదురుగా ఉన్న శ్రీ బాబు ఫోటో వైపు దృష్టిని మరల్చకుండా నిలిపి ఉంచేవారు. ఎవరైనా యితర విషయాలు మాట్లాడబోతే, “నన్ను నా దృష్టి నుండి మరల్చకండి” అని ఖండితంగా చెప్పేవారు. వారి ధర్మపత్ని కాళీసరోజిని మాట్లాడబోయినా అదే జవాబు.

అంతటి పవిత్రము, ఏకాగ్రము అయిన దృష్టిని సద్గురుదేవులపై నిలిపి, ధనుర్మాస ప్రారంభం రోజున అతి పవిత్రమైన ముక్కోటి ఏకాదశితో బాటు శ్రీ గీతా జయంతి కూడ కలిసి వచ్చిన మార్గశిర శుద్ధ ఏకాదశినాటి ఉదయం, ఆశ్రమంలో జరిగే సంకీర్తన వీనుల విందుగా వినిపిస్తుండగా, వెంకటేశ్వర్లుగారు శ్రీ సద్గురులయం పొందారు.

**నిజమైన సత్యగురువు లభ్యమయినప్పుడు జన్మాంతర వాసనలన్నీ పటాపంచలవుతాయి. పరిపూర్ణమైన ఆనందం, సంపదైశ్వర్యాలు సంప్రాప్త మవుతాయి. సత్యగురువు కృపా వీక్షణాలు సదా ప్రసారమయ్యే గృహం ఆనంద దాయకమే అవుతుంది.**

- శ్రీ కాళీబాబు

-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

# భక్త పోతన

**శ్రీ కైవల్య పదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోక**

**రక్షైకారంభకు భక్త పాలన కళా సంరంభకున్ దానవో**

**ద్రేక స్తంభకుఁ గేళిలోల విలసద్దృగ్జాల సంభూతనానా కంజాత**

**భవాండ కుంభకు మహానందాంగనా డింభకున్.**

ఈ పద్యము ద్వారా శ్రీ కృష్ణ భగవానుని స్మరించి మానవ జన్మ పురుషార్థము మోక్ష ప్రాప్తియే అని చెప్పినారు. హరి పరబ్రహ్మాత్వం, సర్వవ్యాపకత్వం సూచించే భీష్ముని స్తుతి-



**ఒక సూర్యుండు సమస్త జీవులకు దానొక్కొక్కడై తోచు**

**పోలికనే దేవుడు సర్వకాలము మహాలీల న్నిజోత్పన్న**

**జన్య కదంబంబుల హృత్సరోరుహములన్ నానా**

**విధానూన రూపకుడై యొప్పుచునుండు నట్టి హరిన్ బ్రార్ధింతు శుద్ధుండనై.**

గజేంద్ర మోక్షంలో తత్త్వ పూరితమైన పద్యములు :

**ఎవ్వనిచే జనించు జగ మెవ్వని లోపలనుండు లీనమై**

**యెవ్వనియందుడిందుఁ పరమేశ్వరుఁడెవ్వడు మూలకారణం**

**బెవ్వఁ డనాది మధ్యలయుడెవ్వడు సర్వము దానయైనవాఁ**

**డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్.**

“ఈ విశ్వం ఎవని వలన ఉద్భవిస్తుందో, ఎవ్వని యందు స్థితమై యెవ్వని యందు లయించునో, ఆ పరమేశ్వరుడు ఎవ్వడో, మూలకారణమైన వాడెవ్వడో, ఆది మధ్య అంతము లేని వాడెవ్వడో, సర్వం తానేయై ఉన్న వాడెవ్వడో, అట్టి ఆత్మభవుడైన ఈశ్వరుని శరణు వేడుచున్నాను.”

**ఒక పరి జగముల వెలినిడి**

**యొకపరి లోపలకి గొనుచు నుభయము దానై**
**సకలార్థ సాక్షియగున**
**య్యకలంకుని నాత్మమూలు నర్థి దలంతున్.**

"లోకమునొకమారు ఉద్భవింపజేసి, ఒకమారు లోపలికి తీసుకొనుచు, వెలుపలను, లోపలను తానై ఉంటూ, సర్వమునకూ సాక్షియైన, నిర్మలుడైన ఆ ఆత్మమూలుని (పరమాత్మను) నేను ఆసక్తితో ధ్యానిస్తాను."

**లోకంబులు లోకేశులు**
**లోకస్థులు దెగినతుది నలోకంబగు పెం**
**జీకటి కవ్వల నెవ్వం**
**డేకా కృతి వెలుగు నతని నే సేవింతున్.**

"ఈ లోకములు, లోకులు, లోకపాలకులందరూ అంతమైన పిమ్మట, అలోకమై పెంజీకటి కవతల ఎవ్వడు ఏకైక పరంజ్యోతి రూపంలో ఉన్నాడో వానినే సేవించెదను."

- సశేషం

**బియ్యపుగింజను పొట్టుపొర కప్పినంత సేపూ అది వడ్లగింజ. దానికి అంకురం వుంది. అనగా అది మొలకెత్తుతుంది. ఆ పొరను తొలగిస్తే అది బియ్యపుగింజ బయటపడుతుంది. దీనికి మొలకెత్తే స్వభావం లేదు. అలాగే అహంకార మమకారములనే పొరల మధ్య వున్నంతసేపూ జీవుడని పిలువబడుతూ, పుడుతూ, చస్తూ, వుండే ఆ మానవుడే, ఆ పొరలు తొలగగానే నిత్యుడైన సదాశివుడై ప్రకాశిస్తాడు.**

- శ్రీ కాళీబాబు

Printed & Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, 24-7-8, Sandeep Mansion, Jonnavittula Vari St.,Gandhi Nagar, Vijayawada-520003, N.T.R.Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

నవంబరు 19 నుండి డిసెంబరు 4 వరకు శ్రీ మాతాజీ వారిచే
ఆస్ట్రేలియా మరియు న్యూజిలాండ్ దేశాల పర్యటన దృశ్యములు



శ్రీ ఫణీంద్ర సతీష్ -
వాణిగార్లతో శ్రీ మాతాజీ



శ్రీ వెంకట కిరణ్ కుమార్ -
శ్రీమతి జానకి గార్లతో శ్రీ మాతాజీ



శ్రీ నీలకంఠగుప్త - శ్రీమతి వాణి
శ్రీ సద్గురు పాదపూజ



**REGD. NEWS MAGAZINE PERIODICAL**
**Posted on Fifth and Sixth of every month**

**RNI No. 37804/81**
**POSTAL REGD. No. : GTR/27/2024-26**

## నవంబరు 19 నుండి డిసెంబరు 4 వరకు శ్రీ మాతాజీ వారిచే ఆస్ట్రేలియా మరియు న్యూజిలాండ్ దేశాల పర్యటన దృశ్యములు



శ్రీ గిరిధర శర్మ మరియు హారిక - శ్రీ సద్గురు పాదపూజ






If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.